


## సిరా చుక్క

స్కూలు సంచుల్లో చేరిన గంజాయి మత్తు*
లక్ష్యాలు పెట్టుకొని చదువుకునే వయసులో
కక్షలను పెంచుకుంటున్నారు వారి మదిలో
బంగారు భవిష్యత్తు గల చిన్నారుల్లో,
మత్తు పదార్థం చేరుతుంది
స్కూలు వారి సంచుల్లో.
దేశాన్ని కాపాడే రేపటి పౌరులు,
వెతుక్కుంటున్నారు నేడు చెడుదారులు.
బడిలో పుస్తకం పట్టాల్సిన చేతులు,
గంజాయి మత్తులో పట్టుకుంటున్నాయి కత్తులు.
కన్నవారి ఆశలను ఆవిరి చేస్తుంది,
గురువుల బోధనలు బూడిద చేస్తుంది.
ఎన్ని అవగాహన సదస్సులు పెట్టిన,
సోషల్ మీడియాలో ఎంత ప్రచారం చేసినా.
ఆగడం లేదు ఈ మహమ్మారి ప్రవాహం,
చూపుతుంది పల్లె పల్లెన దీని ప్రభావం.
గ్రామాన్ని చేరిన ఈ మహమ్మారి,
నీ ఇంటి గుమ్మం చేరకముందే మేలుకో.
కలిసికట్టుగా అందరం ఒకటవుదాం,
పల్లెలో ఉన్న గంజాయి మత్తుని
తరిమికొడదాం,
మన పిల్లల భవిష్యత్తు కాపాడుకుందాం

– మధు పటేల్ నగరి..,
త్రిపురారం, నల్గొండ జిల్లా




# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 37 | ఎడిటర్: మేనం శ్యామ్ | సోమవారం 24-08-2026 | పేజీలు: 10


# కొండా సురేఖకు ఉచ్చు బిగుస్తోందా?

# వరుస పరిణామాలతో కాంగ్రెస్‌లో చర్చ!



- మంత్రిని కేబినెట్ నుంచి తొలగించాలంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్
- సొంత పార్టీ నేతల తీరుపై టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి కొండా సురేఖ లేఖ
- భర్త కొండా మురళికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అపాయింట్‌మెంట్ నిరాకరణ
- కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో డ్రైవర్ అరెస్ట్
- సుమంత్‌పై వ్యాపారిని బెదిరించి రూ.10 కోట్లు డిమాండ్ చేసినట్లు కేసు.
- కొండా సురేఖ వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకోనుందా?





**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణ అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు వరుస పరిణామాలు ఇబ్బందికరంగా మారుతున్నాయి. సొంత పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆమెకు వ్యతిరేకంగా గళం విప్పడం, మంత్రివర్గం నుంచి బహిష్కరించాలంటూ కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేసినట్లు ప్రచారం జరుగుతుండటంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో చర్చ మొదలైంది. కొందరు మంత్రులు, సీనియర్ నేతలు కూడా కొండా సురేఖకు దూరంగా ఉంటున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది.

### టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి కొండా సురేఖ లేఖ

తనపై కొందరు కాంగ్రెస్ నేతలు బహిరంగంగా అవమానకర రీతిలో మాట్లాడుతున్నారని కొండా సురేఖ ఆరోపించారు. తన వివరణను టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి ఇప్పటికే ఇచ్చినప్పటికీ.. తనపై వ్యాఖ్యలు చేస్తున్న నేతల వెనుక ఉన్న అదృశ్య వ్యక్తులను గుర్తించి, పార్టీ క్రమశిక్షణా నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ మల్లు రవికి లేఖ రాసినట్లు తెలుస్తోంది. పార్టీ నాయకత్వం, క్రమశిక్షణా నియమావళిపై తనకు పూర్తి గౌరవం ఉందని, తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని కూడా ఆమె కోరినట్లు సమాచారం.

### కొండా మురళికి అపాయింట్‌మెంట్ నిరాకరణ?

తాజాగా కొండా సురేఖ భర్త కొండా మురళికి పార్టీ సీనియర్ నేతల నుంచి అపాయింట్‌మెంట్

మిగతా 2లో

# పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో జనసేన..

# అభ్యర్థిగా గడల శ్రీనివాసరావు!

- ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ప్రకటన
- ఇతర పార్టీల కంటే ముందుగానే అభ్యర్థిని ప్రకటించిన జనసేన
- వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఎన్నికలకు ఇప్పటి నుంచే కసరత్తు
- ప్రచారం, ఓటర్ల నమోదు, పార్టీ శ్రేణుల సమన్వయంపై ముందస్తు కార్యాచరణ



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై జనసేన పార్టీ ఫోకస్ పెట్టింది. ఇతర రాజకీయ పార్టీల కంటే ముందుగానే అభ్యర్థిని ప్రకటించి ఎన్నికల సమరానికి సిద్ధమైంది. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి డాక్టర్ గడల శ్రీనివాసరావును అభ్యర్థిగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనసేన ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రారంభించింది.

### పవన్ కల్యాణ్ ఆమోదంతో ఖరారు

గడల శ్రీనివాసరావు అభ్యర్థిత్వాన్ని జనసేన పార్టీ నేతలు నేమూరి శంకర్ గౌడ్, రామ్ తాళ్లూరి పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అభ్యర్థిత్వానికి సంబంధించిన పలు అంశాలను పరిశీలించిన అనంతరం గడల శ్రీనివాసరావు పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. అనంతరం పవన్ కల్యాణ్ అధికారికంగా అభ్యర్థిని ప్రకటించారు.

### పట్టభద్రుల ఓటర్లపై ప్రత్యేక దృష్టి

ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్

మిగతా 2లో

# మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో కీలక పరిణామం.. డ్రైవర్ అరెస్ట్!

- తెల్లాపూర్‌లో సుమంత్ ఇంటి వద్ద డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వ్యాపారిని బెదిరించి రూ.10 కోట్లు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు
- ఇనుప రాడ్లతో వ్యాపారిపై దాడి చేసినట్లు కేసు నమోదు
- సుమంత్‌పై ఎఫ్ఐఆర్.. ఆయన కోసం పోలీసుల గాలింపు
- కేసు దర్యాప్తులో భాగంగానే డ్రైవర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు.

2 లో



# రాహుల్ గాంధీకి దమ్ముంటే తెలంగాణకు రావాలి.. బీజేపీ చీఫ్ సవాల్!



- తెలంగాణలో 'ఛత్రోంకీ గూంజ్' పెట్టాలని రాహుల్ గాంధీకి ఎన్. రామచందర్ రావు సవాల్
- తెలంగాణలో అడుగుపెడితే విద్యార్థులే రాహుల్ గాంధీని అడ్డుకుంటారని వ్యాఖ్య
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.12 వేల కోట్లు ఉన్నాయని ఆరోపణ
- విద్యార్థుల సమస్యలపై బీజేపీ కార్యాలయం ముందు రెండు రోజుల నిరాహార దీక్ష
- కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమీషన్లు వసూలు చేస్తోందంటూ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీకి దమ్ముంటే తెలంగాణకు వచ్చి 'ఛత్రోంకీ గూంజ్' కార్యక్రమం నిర్వహించాలని సవాల్ విసిరారు. తెలంగాణలో అడుగుపెడితే రాహుల్ గాంధీని ఒక్క విద్యార్థి కూడా రానివ్వరని, విద్యార్థులే అడ్డుకుంటారని వ్యాఖ్యానించారు. గతంలో హైదరాబాద్‌కు వచ్చిన రాహుల్ గాంధీ విద్యార్థులకు ఇచ్చిన హామీలను మరిచిపోయారని విమర్శించారు.

### విద్యార్థుల సమస్యలపై నిరాహార దీక్ష

తెలంగాణలో విద్యార్థుల సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు రామచందర్ రావు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ఈ దీక్ష

మిగతా 2లో

# యశ్ 'టాక్సిక్' ఈవెంట్‌లో ప్రమాదం .. ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు!

- మల్లారెడ్డి యూనివర్సిటీలో ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో కిందపడిన భారీ ఫ్లడ్ లైట్ స్తంభం
- స్తంభం పడటంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు
- తొక్కిసలాటలో పలువురికి గాయాలైనట్లు పోలీసులు వెల్లడి
- మల్లారెడ్డి కాలేజీపై కేసు నమోదు చేసిన పోలీసులు
- 'టాక్సిక్' చిత్ర యూనిట్‌పై కూడా కేసు నమోదు.. దర్యాప్తు ప్రారంభం.

2 లో



# ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల సమ్మె విరమణ!

- అర్ధరాత్రి నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెను విరమించిన కార్మిక సంఘాలు
- మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చలు సఫలం కావడంతో నిర్ణయం
- 2012 తర్వాత పెరగని ఆటో చార్జీల పెంపునకు ప్రభుత్వం సానుకూలత.
- ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకారం
- ఓలా, ఉబెర్ తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్ ఏర్పాటు
- పాత ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు రూ.1.50 లక్షల సాయం



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల నిరవధిక సమ్మెకు తెరపడింది. రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ నేతలు సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణాశాఖ అధికారులతో ఆటో జేఏసీ నేతలు వర్చువల్‌గా నిర్వహించిన చర్చలు విజయవంతం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ముఖ్యంగా హైదరాబాద్ నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

### డిమాండ్లపై ప్రభుత్వ సానుకూల స్పందన

ఆటో కార్మిక సంఘాల డిమాండ్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. సమ్మె విరమించాలని ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కార్మిక సంఘాలు అంగీకరించాయి. చర్చలు సఫలం కావడంతో సమ్మెను విరమిస్తున్నట్లు జేఏసీ నేతలు వెల్లడించారు. అంతకుముందు ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్‌లు నిలిపివేయాలని కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ పిలుపునిచ్చింది.

### ఆటో చార్జీల పెంపునకు సానుకూలత

2012 తర్వాత ఆటో చార్జీలు పెంచలేదని గుర్తించిన ప్రభుత్వం.. చార్జీల పెంపునకు

మిగతా 2లో

# అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరణ .. సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు!

- రాజకీయ కారణాలతోనే అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వలేదని ఆరోపణ
- లండన్ పర్యటన పూర్తి చేసుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం
- హైదరాబాద్‌కు చేరుకున్న తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తానని ప్రకటన
- మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నేతలు, ప్రజలకు సీఎం కృతజ్ఞతలు
- అమెరికా పర్యటనలో విద్య, పెట్టుబడులు, సాంకేతికతపై చర్చలకు ముందస్తు ప్రణాళిక

2 లో



# కొండా సురేఖకు ఉచ్చు బిగుస్తోందా?
# వరుస పరిణామాలతో కాంగ్రెస్‌లో చర్చ!

**మొదటి పేజీ తరువాయి**



లభించకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలపై సీనియర్ నాయకులను కలిసి వివరణ ఇచ్చేందుకు కొండా మురళి రెండు రోజులుగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరినప్పటికీ.. ఆయన నుంచి సానుకూల స్పందన రాలేదని తెలుస్తోంది.



**కాంగ్రెస్‌లో వ్యూహాత్మక దూరమా?**

ప్రభుత్వం, పార్టీలో కీలక స్థానంలో ఉన్న భట్టి విక్రమార్క అపాయింట్‌మెంట్ నిరాకరించడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలో క్రమశిక్షణను కాపాడేందుకే అధిష్ఠానం పెద్దలు కొండా కుటుంబంతో వ్యూహాత్మక దూరం పాటిస్తున్నారా అనే చర్చ కూడా సాగుతోంది. ఈ పరిణామం కొండా అనుచరులతో పాటు వరంగల్ జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది.

**మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో డ్రైవర్ అరెస్ట్**

మరోవైపు కొండా సురేఖ వద్ద ఓఎస్డీగా పనిచేసిన సుమంత్‌కు సంబంధించిన కేసు కూడా ఇప్పుడు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సుమంత్ ఇంటి వద్ద పనిచేస్తున్న డ్రైవర్‌ను పోలీసులు తెల్లాపూర్‌లో అరెస్ట్ చేశారు. ఓ వ్యాపారిని బెదిరించి రూ.10 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో పాటు ఇనుప రాడ్లతో దాడి చేశాడనే ఆరోపణలపై సుమంత్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

**సుమంత్ నియామకం, తొలగింపుపైనా చర్చ**

కొండా సురేఖ ఆదేశాల మేరకు సుమంత్ 2023 డిసెంబర్ 17న తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా చేరినట్లు సమాచారం. 2024 డిసెంబర్ 16తో ఆయన కాంట్రాక్ట్ గడువు ముగియగా.. మరో ఏడాది పాటు పొడిగించారు. 2025 డిసెంబర్ 16 వరకు విధుల్లో కొనసాగాల్సి ఉన్నప్పటికీ.. అదే ఏడాది అక్టోబర్ 17న ప్రభుత్వం ఆయనను విధుల నుంచి తొలగించింది.వరుసగా చోటుచేసుకుంటున్న ఈ పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖ వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల సమ్మె విరమణ!

**మొదటి పేజీ తరువాయి**

సానుకూలంగా స్పందించింది. ఎంత మేర పెంచాలనే అంశంపై నివేదిక తీసుకుని సంబంధిత ఉత్తర్వులు జారీ చేసేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

**ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు**

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. బోర్డు విధి విధానాలపై సెప్టెంబర్ 1న కార్మిక శాఖ, రవాణా శాఖ, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సంయుక్త సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.

**ఓలా, ఉబెర్ తరహాలో ప్రభుత్వ యాప్**

ఓలా, ఉబెర్ తరహాలో ప్రభుత్వం తరఫున ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. యాప్ ప్రారంభించేందుకు ఐటీ శాఖ ద్వారా తగిన ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై రాపిడో, ఓలా, ఉబెర్ తరహా సేవల్లో ప్రయాణికుల రవాణాకు ఎల్లో ప్లేట్ ఉన్న వాహనాలకే అనుమతి ఇచ్చే అంశంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

**రూ.12 వేల హామీపై సానుకూల నిర్ణయం**



గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు రూ.12 వేల ఆర్థిక సాయం అంశాన్ని పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సహచర మంత్రులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

**పాత ఆటోలకు రూ.1.50 లక్షల సాయం**

హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో పాత డీజిల్, పెట్రోల్ ఆటోలను రెట్రోఫిట్మెంట్ ద్వారా ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు ప్రభుత్వం రూ.1.50 లక్షల వరకు సహాయం అందించనుందని మంత్రి తెలిపారు. కొత్త ఆటోలు కొనుగోలు చేసేందుకు సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందన్నారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ ఆటోలను ప్రోత్సహిస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

**సమ్మె విరమించిన కార్మిక సంఘాలకు మంత్రి ధన్యవాదాలు**

ఆటో కార్మిక సంఘాలతో జరిగిన చర్చలు సఫలమయ్యాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తమ విజ్ఞప్తికి స్పందించి నిరవధిక సమ్మెను విరమించిన ఆటో కార్మిక సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల డిమాండ్ల పట్ల ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు.

# యశ్ 'టాక్సిక్' ఈవెంట్‌లో ప్రమాదం
# .. ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు!

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** ప్రముఖ నటుడు రాకింగ్ స్టార్ యశ్ నటించిన 'టాక్సిక్' సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈవెంట్ జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా భారీ ఫ్లడ్ లైట్ స్థంభం కిందపడటంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి.

**ఫ్లడ్ లైట్ స్థంభం కిందపడి..**

కార్యక్రమం మధ్యలో భారీ ఫ్లడ్ లైట్ స్థంభం ఒక్కసారిగా కిందపడింది. ఈ ప్రమాదంలో స్థంభం తగలడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గాయపడిన వారిని హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

**తొక్కిసలాటలో పలువురికి గాయాలు**

ఈవెంట్‌లో తొక్కిసలాట కూడా జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో పలువురు గాయపడినట్లు వెల్లడించారు. కార్యక్రమ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**కాలేజీ, చిత్ర యూనిట్‌పై కేసులు**

ప్రమాదానికి సంబంధించి మల్లారెడ్డి కాలేజీపై పోలీసులు కేసు నమోదు చేశారు. టాక్సిక్ సినిమా కార్యక్రమం నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఇదే వ్యవహారంలో 'టాక్సిక్' చిత్ర యూనిట్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనకు దారితీసిన కారణాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోంది.

# అమెరికా పర్యటనకు
# కేంద్రం అనుమతి నిరాకరణ
# .. సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు!



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తన అమెరికా పర్యటన రద్దు వ్యవహారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ కారణాలతోనే కేంద్ర విదేశాంగ శాఖ తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించిందని ఆరోపించారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం లండన్ పర్యటన అనంతరం అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లాల్సి ఉండగా.. కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో పర్యటనలో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు.

**లండన్ పర్యటన పూర్తి.. హైదరాబాద్‌కు పయనం**

లండన్‌లో ముందుగా నిర్ణయించిన సమావేశాలు, కార్యక్రమాలను పూర్తి చేసినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. బోస్టన్‌కు వెళ్లే అవకాశం లేకపోవడంతో లండన్ పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నట్లు తెలిపారు. మరికొన్ని గంటల్లో హైదరాబాద్‌కు చేరుకుంటానని, అక్కడికి వచ్చిన తర్వాత అమెరికా పర్యటన రద్దుకు సంబంధించిన అన్ని అంశాలపై సవివరంగా మాట్లాడతానని స్పష్టం చేశారు.

**ఖర్గేకు ప్రత్యేక కృతజ్ఞతలు**

అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించిన అంశంలో తనకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా తనకు అండగా నిలిచిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, దేశవ్యాప్తంగా మద్దతు తెలిపిన ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు.

**విద్య, పెట్టుబడులపై చర్చలకు ప్రణాళిక**

అమెరికా పర్యటనలో భాగంగా బోస్టన్‌తో పాటు ఇతర నగరాల్లో పర్యటించి విద్య, నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత, పెట్టుబడులు, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలపై చర్చలు జరపాలని తెలంగాణ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ప్రముఖ విద్యా సంస్థలతో సమావేశాలు నిర్వహించడంతో పాటు పలు భాగస్వామ్య ఒప్పందాలపై చర్చించాలని భావించింది.

**కేంద్రం-కాంగ్రెస్ మధ్య కొనసాగుతున్న వివాదం**

రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో ఇప్పటికే కాంగ్రెస్, కేంద్ర ప్రభుత్వాల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. పర్యటనకు అనుమతి నిరాకరణపై కేంద్ర విదేశాంగ శాఖ తన వివరణ ఇచ్చినప్పటికీ.. కాంగ్రెస్ నేతలు కేంద్రం నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. తాజాగా రేవంత్ రెడ్డి కూడా రాజకీయ కారణాలతోనే అనుమతి నిరాకరించారని ఆరోపించడంతో ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది.హైదరాబాద్‌కు చేరుకున్న తర్వాత రేవంత్ రెడ్డి ఈ అంశంపై ఎలాంటి వివరాలు వెల్లడిస్తారు? కేంద్రంపై మరిన్ని విమర్శలు చేస్తారా? అనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో
# కీలక పరిణామం.. డ్రైవర్ అరెస్ట్!

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుమంత్ దగ్గర పని చేస్తున్న డ్రైవర్‌ను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. తెల్లాపూర్‌లోని సుమంత్ ఇంటి వద్ద డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**వ్యాపారిని బెదిరించి రూ.10 కోట్లు డిమాండ్,**

వ్యాపారిని బెదిరించి రూ.10 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సుమంత్‌పై ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా ఇనుప రాడ్లతో వ్యాపారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు ఫిర్యాదు అందడంతో పోలీసులు సుమంత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే ఆయన వద్ద పనిచేస్తున్న డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం.

**సుమంత్ కోసం గాలింపు**

కేసు నమోదైనప్పటి నుంచి మాజీ ఓఎస్డీ సుమంత్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. వ్యాపారిని బెదిరించడం, దాడి చేయడం వెనుక ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది.

# గచ్చిబౌలిలో ఏడంతస్తుల భవనం కూల్చివేత
# .. ఇద్దరు కార్మికులు మృతి!

- **మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు టైల్స్ కార్మికులు మృతి.. మరో ఇద్దరికి గాయాలు**
- **రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు**
- **నిందితుడు సాజిద్‌పై 105 బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు**
- **పోలీసుల అదుపులో నిందితుడు సాజిద్**
- **అనుమతులు లేకుండా నాలాను ఆనుకుని భవన నిర్మాణం**
- **బిల్డర్, కాంట్రాక్టర్లపై నాన్‌బెయిలబుల్ కేసులు**

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కూలిన ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. శనివారం జరిగిన ఈ ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు టైల్స్ కార్మికులు మృతిచెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. ఘటనను తీవ్రంగా పరిగణించిన రాయదుర్గం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.

**సాజిద్‌పై కేసు.. పోలీసుల అదుపులో**

భవనం నిర్మాణానికి సంబంధించిన వ్యవహారంలో నిందితుడు సాజిద్‌పై 105 బీఎన్ఎస్ సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం సాజిద్ పోలీసుల అదుపులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిపై మరిన్ని చర్యలు తీసుకునేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణం**

అతి తక్కువ స్థలంలో, నాలాను ఆనుకుని ఏడంతస్తుల అక్రమ నిర్మాణం చేపట్టినట్లు మున్సిపల్ అధికారులు గుర్తించారు. గతంలోనే అధికారులు ఆ భవనాన్ని సీజ్ చేసినప్పటికీ.. నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ నిర్మాణ పనులు కొనసాగించినట్లు వెల్లడించారు. నిర్మాణ సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

**బిల్డర్, కాంట్రాక్టర్లపై నాన్‌బెయిలబుల్ కేసులు**

నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బిల్డర్, కాంట్రాక్టర్లపై పోలీసులు నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. మరోవైపు అంజయ్య నగర్‌లోని ఇతర అక్రమ కట్టడాలపై కూడా హైడ్రా అధికారులు నివేదిక కోరారు.

**అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు**

అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు హెచ్చరించారు. అంజయ్య నగర్‌లో అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.



# రాహుల్ గాంధీకి దమ్ముంటే
# తెలంగాణకు రావాలి..
# బీజేపీ చీఫ్ సవాల్!

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహించనున్నట్లు చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.12 వేల కోట్లకు చేరాయని, బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలు సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**పోలీసులు అనుమతి ఇవ్వకున్నా దీక్ష**

బీజేపీ కార్యాలయం ముందు నిరాహార దీక్షకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదని రామచందర్ రావు ఆరోపించారు. అనుమతి లేకపోయినా పార్టీ కార్యాలయంలోనే దీక్ష చేపడతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.4 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. హైకోర్టు జోక్యం చేసుకుంటే తప్ప ప్రభుత్వం బకాయిలు చెల్లించలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు**

తెలంగాణలో ప్రభుత్వాన్ని హైకోర్టు నడిపించే పరిస్థితి ఏర్పడిందని రామచందర్ రావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అవినీతికి మారుపేరుగా మారిందని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుందనే ఆరోపణలు ఉండేవని, ప్రస్తుతం రేవంత్ రెడ్డి సోదరులపై కూడా అలాంటి ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమీషన్లు వసూలు చేస్తోందని ఆరోపించారు.

**22-ఏపై రాష్ట్రవ్యాప్త ఉద్యమం**

22-ఏ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలంగాణ బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో అంతర్గత అసమ్మతి పెరిగిందని అన్నారు. ఏ ప్రభుత్వం అయినా ఐదేళ్లు పూర్తి చేయాలని తాము కోరుకుంటున్నామని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగుతుందనే నమ్మకం లేదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నం బీజేపీ చేయదని స్పష్టం చేశారు.

**మోదీ @25 సేవా సంకల్ప్ అభియాన్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రామచందర్ రావు తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు 'మోదీ @25 సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను నేరుగా కలిసేందుకు పార్టీ అధిష్ఠానం నిర్ణయించిందని వెల్లడించారు.

# కాంగ్రెస్-బీజేపీ నాటకం తేటతెల్లం..
# రైతులకు నీళ్లే ఇవ్వని ప్రభుత్వంపై జగదీష్‌రెడ్డి ఫైర్

- **కాళేశ్వరం పేరుతో రాజకీయాలు**
- **కన్నెపల్లి పంపులు ఎందుకు ఆన్ చేయరని ప్రశ్న**
- **సాగర్‌లో నీళ్లు ఉన్నా ఎడమ కాల్వ రైతులకు సాగునీరు ఇవ్వడం లేదని ఆగ్రహం**
- **ఎల్‌నినో కాదు.. తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వమే శాపమని**
- **తీవ్ర వ్యాఖ్యలు పోతిరెడ్డిపాడు ద్వారా 140 టీఎంసీల నీటిని ఏపీ అక్రమంగా తరలించుకుపోయిందని ఆరోపణ**
- **కేసీఆర్‌కు క్షమాపణ చెప్పి కన్నెపల్లి పంపులు ఆన్ చేయాలి**
- **ప్రత్యేక కార్యాచరణకు బీఆర్ఎస్ సిద్ధం**

**ప్రజా వాయిస్, హైదరాబాద్.** తెలంగాణలో రైతులకు సాగునీరు అందించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జి. జగదీష్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం, బీజేపీ కలిసి ఆడుతున్న రాజకీయ నాటకం ఇప్పుడు తేటతెల్లమైందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్నెపల్లి పంపింగ్‌ను పునరుద్ధరించి, నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ఆయన చేసిన ప్రధాన ఆరోపణలు పలు మీడియా కథనాల్లోనూ నమోదయ్యాయి.కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన సుందిళ్ల, అన్నారం బ్యారేజీలపై సెంట్రల్ వాటర్ కమిషన్ నివేదిక వచ్చిన తర్వాత ప్రభుత్వ వైఖరి మరింత స్పష్టమైందని జగదీష్‌రెడ్డి అన్నారు. మేడిగడ్డ బ్యారేజీతో సంబంధం లేకుండా కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ప్రారంభించాలని కేటీఆర్ అనేకసార్లు సూచించినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్‌డీఎస్ఏ పేరుతో సాకులు చెబుతూ చెప్పిన అబద్ధాలనే పదేపదే చెబుతున్నారని మండిపడ్డారు.కమిషన్లకు అలవాటు పడిన ప్రభుత్వం లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కన్నెపల్లి పంపులను సకాలంలో ఆన్ చేసి ఉంటే మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ వంటి జలాశయాలు నిండేవని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని కేసీఆర్‌కు క్షమాపణలు చెప్పి కన్నెపల్లి పంపులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో జనసేన..
# అభ్యర్థిగా గడల శ్రీనివాసరావు!

**మొదటి పేజీ తరువాయి**

జిల్లాల పరిధిలోని పట్టభద్రుల ఓటర్లను దృష్టిలో పెట్టుకుని జనసేన వ్యూహరచన చేస్తోంది. వైద్య, ఆరోగ్య రంగంలో పనిచేసిన అనుభవం ఉన్న గడల శ్రీనివాసరావును బరిలోకి దింపడం ద్వారా పట్టభద్రులు, ఉద్యోగులు, యువతతో పాటు వివిధ వర్గాలను ఆకట్టుకోవాలని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఇప్పటి నుంచే ఎన్నికల కసరత్తు**

ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే అభ్యర్థిని ప్రకటించడం ద్వారా ప్రచారం, ఓటర్ల నమోదు, పార్టీ శ్రేణుల సమన్వయం వంటి అంశాలపై ముందుగానే దృష్టి సారించే అవకాశం జనసేనకు లభించింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలమైన పోటీ ఇవ్వాలనే లక్ష్యంతో నియోజకవర్గ పరిధిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించేందుకు జనసేన సిద్ధమవుతోంది. పవన్ కల్యాణ్ ఆమోదంతో అభ్యర్థిత్వం ఖరారు కావడంతో ఈ ఎన్నికల్లో జనసేన పోటీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# కుంగ్ - ఫు తో ఉజ్వల భవిష్యత్తు

- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

**ప్రజా వాయిస్ కొత్తగూడెం** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలో విద్యార్థులకు చదువుతో పాటు కుంగ్ ఫు క్రీడ వల్ల ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జైభీమ్ రావ్ భారత్ పార్టీ.జేబీపీ, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు.ఆదివారం నాడు స్థానిక శ్రీరామ ఫంక్షన్ హాల్ నందు శావలిన్ లోహాన్ కుంగ్ ఫు ఫౌండర్ బానోత్ సాగర్ మాస్టర్ శిక్షణలో శిక్షణ పొందిన బాల,బాలికలు,యువకులకు నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కామేష్ అర్హత సాధించిన వారికి ఎల్లో,ఆరంజ్,గ్రీన్,బ్లూ,బ్రౌన్ మరియు బ్లాక్ బెల్ట్ లను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని కొన్ని చిన్న దేశాల పేర్లను సైతం గుర్తు పెట్టుకోవటానికి అక్కడి ప్రజలు క్రీడల్లో రాణించడమే కారణమన్నారు.తల్లిదండ్రులు పిల్లలను చదువుకే పరిమితం చేయకుండా క్రీడల్లోను ప్రోత్సహించాలని కోరారు.ఏషియన్ గేమ్స్ లో కూడా వూషూ ద్వారా కుంగ్ ఫు క్రీడ వున్నందున క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు త్వరగా లభిస్తాయని తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం పట్టణంలోని ప్రగతి మైదానంలో శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఆసక్తి కలిగిన వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వి.అమర్ సింగ్,సీనియర్ మాస్టర్స్ ఎల్.ఆదినారాయణ,పి.కాశీ హుస్సేన్,ఎ.రాంబాబు,జి.రాంబాబు,యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మాలోత్ రాజా,కె.శ్రీనివాస్,ఎన్.వెంకటేశ్వర్లు. తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సాగు గట్టెక్కేనా?



- వర్షాల కోసం రైతన్నల ఎదురు చూపులు
- పత్తి పంటపై ఆందోళన



**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడే సిర్పూర్ నియోజకవర్గ రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ పరీక్షగా మారింది.15 మండలంలో ఇదే పరిస్థితి నెలకొన్నది .కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్ , సిర్పూర్–టి, కగజ్ ,దాహేగాం,ఆసిఫాబాద్,పెంచిక ల్పేట, జైనూర్, కేరమేరి, లింగాపూర్, తీర్యని, సిర్పూర్ యు తదితర మండలాల్లో తొలకరి వర్షాలను నమ్ముకుని దుక్కులు దున్ని పత్తి, ఇతర పంటలు సాగు చేసిన రైతులు ఇప్పుడు మళ్లీ వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు.జూన్ ప్రారంభంలో వర్షాలు ఆశించినంతగా లేకపోవ డంతో పత్తి విత్తనాలు వేసిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జూలైలో కొంత మేర వర్షాలు కురిసి సాగు ఊపందుకున్నప్పటికీ, ఆ తర్వాత ఏర్పడిన పొడి వాతావరణం పంటల ఎదుగుదలను దెబ్బతీసింది. గతంలో జూలైలోనే పంటలకు అవసరమైన తేమ అందే పరిస్థితి ఉండగా, ఈసారి వర్షాల విరామాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జూన్‌లోనే పత్తి మొలకలు, పంటల పెరుగుదలపై వర్షాభావ ప్రభావం కనిపించినట్లు అప్పటి ప్రాంతీయ నివేదికలు కూడా పేర్కొన్నాయి.ఇక జూలైలో కురిసిన భారీ వర్షాలు జిల్లాలో కొంత ఉపశమనం కలిగించాయి. జూలై 1 నాటికి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సాధారణం కంటే స్వల్పంగా అధిక వర్షపాతం నమోదైనట్లు నివేదికలు వెల్లడించాయి. జూలై చివర్లోనూ జిల్లాలో భారీ వర్షాలు నమోదయ్యాయి. అయితే వర్షం ఒకేసారి భారీగా కురవడం కంటే, పంటకు అవసరమైన సమయంలో తగినంత తేమ అందడం కీలకమని రైతులు చెబుతున్నారు.రాష్ట్రస్థాయిలోనూ పరిస్థితి పూర్తిగా అనుకూలంగా లేదు. ఆగస్టు 19 నాటికి తెలంగాణలో సాధారణ 488.8 మి.మీ.కు గాను 430.1 మి.మీ. వర్షపాతం నమోదై 12 శాతం లోటు ఉంది. ఆగస్టులోనూ వర్షాలు మందగించడంతో 15 జిల్లాలు లోటు వర్షపాతం కేటగిరీలోకి వెళ్లాయి.సిర్పూర్ టి నియోజకవర్గంలో ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు, నిరంతర నీటి వసతులు పరిమితంగా ఉండటంతో అనేక మంది రైతులు వర్షాలపైనే ఆధారపడుతున్నారు. దీంతో ఒకటి రెండు వర్షాలు ఆలస్యమైనా పంటలపై ప్రభావం పడే పరిస్థితి నెలకొంది. పత్తి మొక్కలను కాపాడుకునేందుకు రైతులు అదనపు ఖర్చులు చేస్తున్నారు. నీటి వసతి ఉన్న రైతులకు కొంత ఊరట ఉన్నప్పటికీ, పూర్తిగా వర్షాధారంగా సాగు చేస్తున్న రైతుల పరిస్థితి మాత్రం ఆందోళనకరంగా ఉంది.రాష్ట్రంలో ఖరీఫ్ సాగు జూలై ద్వితీయార్థంలో వేగం పుంజుకున్నప్పటికీ, రిజర్వాయర్లలో గత ఏడాదితో పోలిస్తే నీటి నిల్వలు తక్కువగా ఉండటం భవిష్యత్ సాగుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.ఇప్పటికైనా పంట కీలక దశలో క్రమం తప్పకుండా వర్షాలు కురిస్తే దిగుబడులను కొంతమేర కాపాడుకునే అవకాశం ఉంది. లేకపోతే ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులకు నష్టం తప్పదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పంట పరిస్థితిని మండలాల వారీగా అంచనా వేసి, వర్షాభావ ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ, పంట సంరక్షణ సూచనలు మరింత వేగంగా అందించాల్సిన అవసరం ఉంది.

# బీ.సీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పగిళ్ళ నవీన్ నియామకం

- జీ.వో 97, శక్తి స్కీము ను తక్షణమే రద్దు చేయాలి
- పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలి
- బీ.సీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్య దర్శిగా పగిళ్ళ నవీన్ డిమాండ్
- బీ.సీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సూర్యవంశం



**నల్లగొండ జిల్లా చందంపేట** మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన పగిళ్ళ నవీన్ ను బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ లేఖను అందజేశారు. ఈ సందర్భంగా.. నూతనంగా ఎన్నికైన బీ.సీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పగిళ్ళ నవీన్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు, సాంకేతిక విద్య ప్రమాణాలు, ఉన్నత విద్యా అవకాశాలను దృష్టిలో ఉంచుకుని జీ.వో 97, శక్తి స్కీము ను తక్షణమే రద్దు చేయాలని.. పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగిస్తూ.. పాలిటెక్నిక్ విద్యార్థుల ఈసెట్, బిటెక్ లేటరల్ ఎంట్రీ అవకాశాలను యథావిధిగా కల్పించాలని, ఎస్.బి.టెట్ స్వయంప్రతిపత్తిని, పాలిటెక్నిక్ విద్య ప్రత్యేకతను కాపాడాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాలలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి, టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ రిక్రూట్మెంట్ తక్షణమే చేపట్టాలన్నారు. ప్రస్తుత విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి నష్టం కలగకుండా స్పష్టమైన హామీ పత్రాన్ని విడుదల చేయాలని రేవంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బి.సి, ఎస్సీ, ఎస్టీ, ఈ.బీ.సీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు స్కాలర్షిప్లతోనే చదువును కొనసాగించాల్సి వస్తుందని.. ఫీజు రియంబర్స్మెంట్ రానందున కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు.. దీనివల్ల విద్యార్థులు పై చదువులకు పోలేక చదువును అర్ధాంతరంగా మానివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల యొక్క భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలి డిమాండ్ చేశారు. ఈ నియామకంలో సహకరించిన బీ.సీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర కార్య వర్గానికి కృతజ్ఞతలు తెలుపుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ముందుండి పని చేస్తానన్నారు.. ఈ కార్యక్రమంలో బి.సి చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి రమేష్, తదితరు పాల్గొన్నారు.

# 'సుందరీకరణ' శిక్ష... ఉపాధికి గ్రహణం!

- రోడ్డున పడ్డ 26 పద్మశాలీ కుటుంబాల బతుకులు
- రహదారి వెడల్పు పేరిట షాపుల కూల్చివేత
- ఏడాది దాటినా కదలని నయా నిర్మాణాలు
- తాత్కాలిక స్థలాల్లో సాగని వ్యాపారం
- నిత్యం అల్లాడుతున్న నేత కార్మికులు



**ప్రజా వాయిస్ గోదావరిఖని** రామగుండం నగరంలో సుందరీకరణ, రహదారి వెడల్పు పేరిట చేపట్టిన కూల్చివేతలు పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన వ్యాపారుల ఉపాధిపై దెబ్బకొట్టాయి. స్థానిక పద్మశాలీ సంఘానికి చెందిన దాదాపు 26 దుకాణాలు, క్వార్టర్లను రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సుందరీకరణ పేరుతో ఏడాది క్రితం నేలమట్టం చేశారు. అయితే ఏడాదవుతున్నా అక్కడ నూతన దుకాణాల నిర్మాణ ప్రక్రియ ఊసెత్తకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. కూల్చివేతల అనంతరం బాధితులకు రామగుండం కార్పొరేషన్ భవన సముదాయంలో తాత్కాలికంగా స్థావరం కల్పించారు. కానీ, ఆ ప్రాంతంలో జనసంచారం తక్కువగా ఉండటం తో అసలు గిరాకీలు కావడం లేదని వ్యాపారులు రోదిస్తున్నారు. రోజంతా షాపులు తెరిచి కూర్చున్నా బోణీలు కూడా కావడం లేదని, అడిగే దిక్కు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. బట్టల వ్యాపారం, నేత వస్తువులు అమ్ముకునే వీరికి కనీసం కస్టమర్లు వచ్చి మాట్లాడే పరిస్థితి కూడా లేకపోవడంతో వీరి జీవితాలు రోజురోజుకూ దుర్భరంగా మారుతున్నాయి.

**సొంతంగా నిర్మించుకునేందుకు అనుమతివ్వండి!**

బాధిత పద్మశాలీ కుటుంబాలు ప్రజాప్రతినిధులను, అధికారులను వేడుకుంటున్నాయి. తిలక్‌నగర్, ఎల్‌బీనగర్, చౌరస్తా, బస్టాండ్ లేదా రాజేష్ టాకీస్ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో తమకు కేటాయింపులు చేస్తే, ప్రజాప్రతినిధులపై భారం పడకుండా తమ సొంత ఖర్చులతోనే దుకాణాలు నిర్మించుకుంటామని స్పష్టం చేస్తున్నారు. ఒక్క షాపు కూడా అదనంగా కోరమని, తమ పాత 26 దుకాణాల పరిమితికే కట్టుబడి ఉంటామని వేడుకుంటున్నారు.

**తక్షణమే స్పందించాలి:**

స్థానిక శాసనసభ్యులు రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ సంకల్పించిన సుందరీకరణ ఆలోచన మంచిదే అయినా, దానివల్ల ఉపాధి కోల్పోయిన నేత కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మరియు రామగుండం కార్పొరేషన్ పైనే ఉంద ని పలువురు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి, పద్మశాలీ కుటుంబాలకు అనువైన చోట వ్యాపార స్థలాలు కేటాయించి, వారి ఉపాధికి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

# రచీరాల/బైకానీ/తేల్జురి ఐక్యతకు కొత్త వేదిక

- యాదవ్‌ల ఉపకులమైన కుల సంక్షేమ సంఘం
- నల్గొండ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు
- రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు వెంకట నారాయణ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక
- జిల్లా అధ్యక్షుడిగా చేగొండి రాజేష్.. ప్రధాన కార్యదర్శిగా బత్తుల కృష్ణ
- కుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే నూతన కార్యవర్గ లక్ష్యం

**ప్రజా వాయిస్, నల్గొండ:** యాదవ్‌లలో ఉపకులమైన తెరచీరాల/బైకానీ/తేల్జురి కుల సంక్షేమ సంఘం బలోపేతంతో పాటు కుల సభ్యుల సంక్షేమం, సమస్యల పరిష్కారం లక్ష్యంగా నల్గొండ జిల్లా నూతన కార్యవర్గ కమిటీని ఏర్పాటు చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు వెంకట నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నల్గొండ జిల్లా అధ్యక్షుడిగా చేగొండి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా బత్తుల కృష్ణ, ఉపాధ్యక్షుడిగా బత్తుల రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా బత్తుల కృష్ణ, సహాయ కార్యదర్శిగా బత్తుల రామకృష్ణ, కోశాధికారిగా బత్తుల గోవర్ధన్, ప్రచార కార్యదర్శిగా దొంగర శ్రీనివాస్లను ఎన్నుకున్నారు.అదేవిధంగా వెంకన్న, పిచ్చయ్య, తరాల యాదగిరి, బత్తుల వీరమల్లు, వెంకటేశం, రాము, గోపయ్య, రాజు, శ్రీను తదితరులను కార్యవర్గ సభ్యులుగా నియమించారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తెరచీరాల/బైకానీ/తేల్జురి కుల సభ్యులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘాన్ని మరింత బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. కుల సభ్యుల సంక్షేమం కోసం, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో నల్గొండ జిల్లా వ్యాప్తంగా పలువురు కుల సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ సంఘం నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



# ఆర్ఎంపీల ముసుగులో దందా

- రెఫరల్ పేరుతో రోగుల జేబులకు చిల్లు..!
- కార్పొరేట్ ఆస్పత్రులకు రోగుల తరలింపు
- వెనుక భారీ కమీషన్ దందా
- సామాన్యుల ఆరోగ్యంతో చెలగాటం
- పట్టించుకోని వైద్య శాఖ




**కేసముద్రం, ప్రజావాయిస్** మండల వ్యాప్తంగా ఉన్న కొందరు ఆర్ఎంపీ డాక్టర్ల తీరు సామాన్య ప్రజల పాలిట శాపంగా మారింది. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలతో వారి వద్దకు వచ్చే అమాయక రోగులను అదునుగా చేసుకొని పెద్ద పెద్ద కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గ్రామాల్లో ఆర్ఎంపీలను నమ్మి వచ్చే రోగులకు "ఇక్కడ తగ్గదు, మా డాక్టర్ దగ్గరికి వెళ్ళు, స్పెషలిస్ట్" అని చెప్పి మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్ పట్టణాల్లోని తమకు పరిచయం ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు పంపుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇలా రెఫర్ చేయడం ద్వారా ఆ కార్పొరేట్ ఆసుపత్రుల నుండి రిఫరల్ చేసిన ఆర్ఎంపీలకు 20 నుండి 30 శాతం వరకు కమీషన్ ముడుతుందని ప్రచారం జరుగుతోంది. రోగి పెద్ద ఆసుపత్రికి వెళ్లిన తర్వాత అక్కడ వారు చెప్పిందే రేటు. బిల్లులు వేలల్లో, లక్షల్లో వసూలు చేస్తున్నారు. తగ్గించే ప్రసక్తే లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమాయకత్వంతో అప్పులు చేసి మరీ వైద్యం చేయించుకుంటున్న సామాన్యుల జేబులు ఖాళీ అవుతున్నాయి. మండలంలో ఈ దందా యథేచ్ఛగా సాగుతున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లోని ఆర్ఎంపీలపై, వారికి కమీషన్లు ఇస్తున్న కార్పొరేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# బండ్లగూడ జాగీర్‌లో అక్రమ నిర్మాణాల జోరు

- అధికారుల మౌనం ఎందుకు.?
- 50 గజాల్లో స్టిల్ట్ ప్లస్ 3 నిర్మాణం
- 100 గజాల్లో ఆరు అంతస్తుల మేడ





**ప్రజా వాయిస్,రాజేంద్రనగర్:** సర్కిల్ బండ్లగూడ జాగీర్ పరిధిలో టౌన్‌ప్లానింగ్ నిబంధనలు గాలికొదిలేసి అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మాధవినగర్‌లో కేవలం 100 గజాల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఆరు అంతస్తుల మేడ నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సెట్‌బ్యాక్‌లు,భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిర్మాణం కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఔట్ సోర్సింగ్ సిబ్బంది అండదండలే కారణమా?**

నిర్మాణం విషయంలో సంబంధిత టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కొందరు భవన యజమానులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**50 గజాల్లో స్టిల్ట్ ప్లస్ 3**

యాదయ్యనగర్ కాలనీ కేకే–1లో మరో అక్రమ నిర్మాణంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కేవలం 50 గజాల స్థలంలో స్టిల్ట్ ప్లస్ 3 అంతస్తుల భవనం నిర్మించి, కింద కమర్షియల్ షాపులు, పై అంతస్తుల్లో నివాసాలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు.ఇటీవల అంజయ్య నగర్‌లో చోటుచేసుకున్న భవన ప్రమాదం నేపథ్యంలో ఇలాంటి నిర్మాణాలపై అధికారులు అప్రమత్తం కావాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలపై తక్షణమే తనిఖీలు నిర్వహించి,అక్రమమని తేలితే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలకు ఎవరి అండదండలు ఉన్నాయో తేల్చేందుకు ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# క్రీడల్లో విద్యార్థులకు ప్రోత్సాహం

- కే.ఆర్ డెవలపర్స్ అధినేత, మాజీ ఎంపీపీ రాములు యాదవ్
- కబడ్డీ పోటీల్లో రన్నర్ గా నిలిచిన ఉన్నత పాఠశాల విద్యార్థుల జట్టు

**ప్రజావాయిస్/కోట్ పల్లి:** తాండూర్ లో హిందూ ధార్మిక పరిషత్, శ్రీ సాయి పుత్ర హోమ్స్ డెవలపర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలో కోటపల్లి మండలం నుంచి కె.ఆర్ డెవలపర్స్ బలపరిచిన కోటపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్ కప్ సాధించడం జరిగింది. గ్రామీణ ప్రాంతంలో ఉన్న విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికితీయాలని తాండూరులో నిర్వహించిన కబడ్డీ పోటీలకు, కోటపల్లి విద్యార్థులను ఈ క్రీడా పోటీలలో పాల్గొనే విధంగా ప్రోత్సహించడం జరిగిందన్నారు.విద్యార్థులు మంచి ప్రతిభ కనపరిచి తాండూర్ నియోజకవర్గంలో కోటపల్లి విద్యార్థులు రన్నర్ కప్ ను సాధించడం ఎంతో గర్వకారణంగా అనిపించిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కె. ఆర్ డెవలపర్స్ అధినేత మాజీ ఎంపీపీ రాములు యాదవ్, మాజీ కోటపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఉప్పరి మహేందర్, పిఈటి, ప్రేమ్ కుమార్ సార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యోగాల భర్తీకి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలి!

- నేలకొండపల్లిలో ఏఐవైఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ
- ఖాళీలు 20 వేలు.. నోటిఫికేషన్ 7 వేలకా?
- జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ ఆగ్రహం
- 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?:
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఏఐవైఎఫ్ విమర్శలు

**ప్రజా వాయిస్ ఖమ్మం** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 20 వేల కానిస్టేబుల్ పోస్టులకు గానూ ప్రభుత్వం కేవలం 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడంపై ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న కానిస్టేబుల్ ఖాళీలన్నింటినీ ఒకేసారి భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏటా సుమారు 9 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నా, ఆ స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టకపోవడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా నిరుద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆయన విమర్శించారు. ఉద్యోగాల కోసం యువత లక్షల రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటూ ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని, అలాగే ఉద్యోగ ఖాళీల భర్తీకి ఒక ప్రత్యేక కార్యాచరణను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో జరగనున్న ఏఐవైఎఫ్ 3వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. యువత, నిరుద్యోగుల సమస్యలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న ఈ మహాసభల్లో నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి పాలపాటి అశోక్, కోశాధికారి బాలిన కృష్ణంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మూడు శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి మెదక్ జిల్లాకు భారీ వర్ష హెచ్చరిక

- ఎల్లో అలర్ట్ జారీ..
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఉరుములు, మెరుపులతో వర్షం
- గంటకు 30–40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు



**ప్రజా వాయిస్ సంగారెడ్డి :** తెలంగాణలో వర్షాల ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో మెదక్ జిల్లాకు భారీ వర్ష హెచ్చరిక జారీ అయింది. భారత వాతావరణ శాఖ (IMD) హైదరాబాద్ కేంద్రం ఆదివారం మధ్యాహ్నం విడుదల చేసిన తాజా వాతావరణ బులెటిన్ ప్రకారం మెదక్ జిల్లాను ఎల్లో అలర్ట్ పరిధిలో చేర్చారు.ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.ఈ నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉండటంతో ఎల్లో అలర్ట్ కొనసాగుతోంది.మెదక్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలిమెదక్ జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వర్షం సమయంలో వాగులు, వంకలు, చెరువులు, కాజ్‌వేల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి. ఉరుములు, మెరుపులు సంభవిస్తున్న సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడకుండా సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలి.రైతులు, వ్యవసాయ కూలీలు పొలాల్లో పనిచేసే సమయంలో వాతావరణ పరిస్థితులను గమనించాలని, ఈదురుగాలులు–మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.మెదక్‌కు ఎల్లో అలర్ట్ ఉన్న నేపథ్యంలో ప్రజలు అధికారిక వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి.

# పార్టీల్లో కొట్లాటలు! ప్రజల్లో అసంతృప్తులు?

- ఒకపక్క బిఆర్ఎస్ పార్టీలో వర్గ పోరు!
- అధికార పార్టీలో పాత కాంగ్రెస్ నాయకులకు చుక్కెదురు!
- జాతీయ ప్రాంతీయ పార్టీల లొల్లితో ప్రజలకు ఇక్కట్లు!
- రాబోయే కాలంలో పార్టీలపై నమ్మకం పోతుందంటున్న సీనియర్ సిటిజెన్లు
- నియోజకవర్గంలోని వివిధ భేదాలతో ప్రయాణిస్తున్న శ్రేణులు?
- ఏ పార్టీలు గెలిచిన ప్రజలకు ఒరిగేదేమీ లేదంటున్న ప్రజానీకం!







**ప్రజా వాయిస్ అశ్వారావుపేట** ప్రస్తుత రాజకీయ పార్టీలోని శ్రేణుల నడవిడక తో లొల్లి ఏర్పడి కొట్లాటకు దారి తీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒకపక్క బీఆర్ఎస్ పార్టీ శ్రేణులలో వర్గ పోరు మొదలయ్యి పార్టీ టిక్కెట్లు తమకే దక్కాలంటూ రోజురోజుకు ముదిరి పాకానికి వస్తున్న సంఘటనలు రాష్ట్ర నాయకులు వద్దకు పంచాయతీలు చేరుకున్నాయి. మరోపక్క అధికార పార్టీ సీనియర్ నాయకులకు చుక్కెదురై వివిధ రకాల పార్టీ కార్యక్రమాలకు దూరంగా నడుచుకుంటున్నారని భారీగా ప్రచారం కొనసాగుతూనే ఉంది. ఇక జాతీయ ప్రాంతీయ పార్టీల శ్రేణులు దోస్తీలు కట్టడంతో ప్రజలకు ఇక్కట్లు ఎదురై పూర్తిస్థాయిలో నమ్మకాన్ని కోల్పోతున్నారు. ఉద్యమ పార్టీలలో పనిచేస్తున్న కొందరు నాయకులు తమ అవసరాల కోసం నమ్ముకున్న కార్యకర్తలను వదిలేసి అధికార పార్టీ వైపు చూడటంతో ఇటుపక్క వెళ్లాలో తెలియక ప్రజలు ఇక్కట్లు పడుతున్న సందర్భాలు కనిపిస్తూనే ఉన్నాయి. రాబోయే కాలంలో ప్రధాన పార్టీలు వామపక్షాల నాయకత్వాల నడవడికపై ప్రజలకు నమ్మకం పోయే విధంగా ఉంటుందని సీనియర్ సిటిజెన్లు హేతువులను సైతం వల్లిస్తున్నారు. నియోజకవర్గంలోని వివిధ భేదాలతో ప్రధాన నాయకులు ప్రయాణిస్తున్నారని ఏ పార్టీలు గెలిచిన ప్రజలకు మాత్రం ప్రభుత్వం నుండి గాని నాయకత్వాల నుండి గాని ఒరిగేదేమీ లేదని ప్రజానీకం ఘాటుగానే వక్రకిస్తున్నారు. ఏది ఏమైనా నియోజకవర్గంలోని ప్రధాన పార్టీ నాయకుల నడవడిక పై ప్రజలకు పూర్తిగా విశ్వాసం కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని కట్టడచేసే మార్గదర్శకాలు లేకపోవడంతో బరితెగించి ప్రవర్తించే విధంగా నడుచుకుంటున్నారని నియోజకవర్గంలో పెద్ద చర్చనీయాంసంగే మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట, ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపరెడ్డిపల్లి. వంటి మండలాల్లో బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల మధ్య భయంకరమైన యుద్ధ పోరు కొనసాగుతుందన్న మాట వాస్తవం! ఒకపక్క అధికారం కోసం ప్రజల సమస్యలపై కొట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీలో వర్గ పోరు తో నడవడం కొందరు సీనియర్ నాయకులకు తలనొప్పిగా మారింది. నిజానికి కలిసిమెలిసి ఉంటూ ప్రజల సమస్యపై కొట్లాడి దక్కించుకునే విధంగా పనిచేయాలని అతి స్థానం పదేపదే ఆదేశాలు జారీ చేసినప్పటికీ స్థానిక నాయకత్వంలో పదవులు వల్ల రెండు వర్గాలుగా విడిపోయి నడవటం సీనియర్ నాయకత్వానికి జీర్ణించుకోలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే అధికార పార్టీ కాంగ్రెస్ గత పదేళ్ల పాలనలో ఒంటరి పోరాటం కొనసాగించి పార్టీ బాధ్యతలను భుజాన వేసుకున్న గెలిపించుకొని చివరికి వలసవాదుల వల్ల సీనియర్ నాయకులకు తీవ్ర నష్టం కలిగిందని చెప్పుకోవచ్చు. పార్టీ కార్యక్రమాలతో పాటు పదవుల సైతం దక్కకపోవడంతో సీనియర్ నాయకత్వం కాస్త వెనకంజు వేస్తూ జై కాంగ్రెస్ అనటమే తప్ప చేసేదేమీ లేదన్న వాదన లేకపోలేదు. ఇదిలా ఉంటే నియోజకవర్గంలోని 1, 90 వేల ఓటు బ్యాంకు కలిగిన ప్రజానీకం మాత్రం ఏ పార్టీ గెలిచిన ఏ నాయకుడు వచ్చినా తమ స్వార్థాలకే తప్ప ప్రజల సమస్యలపై కొట్లాడి నాయకుడు లేడని విమర్శలు లేకపోలేదు ముఖ్యంగా అశ్వారావుపేట నియోజకవర్గం కావటం శుభ పరిణామాలే! అంతేకాకుండా పంచాయతీ నుండి మున్సిపాలిటీ జరగటం కొన్ని ప్రాంతాలు మండలాలుగా కొనసాగుతున్న కనీస వసతులు ఏర్పాట్లు చేయడంలో ఇబ్బందులు పాలు అవుతున్నారని ముఖ్యంగా విద్యార్థుల పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న విధానంపై బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతున్న జీవోలు విడుదల అయిన తర్వాత ప్రభుత్వంలో ఎలాంటి మార్పు రాదని కొందరు సీనియర్ సిటిజన్ల సైతం ఖండిస్తున్నారు వైద్యం విషయానికి వస్తే పేరుకే ఆసుపత్రిలో ఉన్న వైద్యం కోసం జిల్లా వైపు పరుగులు పెట్టాల్సిందే! అధికార పార్టీ కాంగ్రెస్ మాత్రం ఎక్కడ అభివృద్ధిలో రాజీపడి ప్రసక్తే లేదని చెబుతున్న మాటల కేవలం మాటలకే పరిమితమే తప్ప కాగితాలు లేవని వంద పడకల ఆసుపత్రిని బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలైన సంగతి కాంగ్రెస్ మర్చిపోయిందని అలాగే నాలుగు మండలాల్లో సెంట్రల్ లైటింగ్ పనులు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం పై మాజీ ఎమ్మెల్యేలు కార్యకర్తలు విరుచుకుపడుతున్నారు ప్రస్తుతానికి ఇటువంటి పరిస్థితులలో జాతీయ ప్రాంతీయ పార్టీల్లో ఉన్న నాయకులు సైతం కూడా పెదవి విప్పే పరిస్థితి లేకుండా పోయిందని ఇటువంటి విభేదాల వల్ల పార్టీలపై ప్రజలకు నమ్మకం పోతుందని సీనియర్ సిటిజన్ల సైతం వివిధ రకాల పార్టీ లపై విరుసుకుపడుతున్నారు.

# విషాదంలో చెన్ను నాగిరెడ్డి కుటుంబానికి భరోసా ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి

- భూదాన్ పోచంపల్లి రియాక్టర్ పేలుడు ఘటనలో చిన్నగూడెం వాసి చెన్ను నాగిరెడ్డి మృతి
- మృతుడి పార్థివాదేహానికి పూలమాల వేసి ఘన నివాళి
- ఏ ఆపద వచ్చినా మీ పెద్దన్నగా వెన్నుదన్నుగా ఉంటా అంటూ కుటుంబానికి ధైర్యం
- హాజరైన హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి



**ప్రజా వాయిస్, నాగార్జునసాగర్:**నల్గొండ జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దొంతిగూడెం గ్రామ పరిధిలోని కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన రియాక్టర్ పేలుడు ఘటనలో నాగార్జునసాగర్ నియోజకవర్గం పెద్దవూర మండలం చిన్నగూడెం గ్రామానికి చెందిన చెన్ను నాగిరెడ్డి మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే శ్రీ కుందూరు జయవీర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో కెమికల్ ఫ్యాక్టరీ (ఫార్మా కంపెనీ) యాజమాన్యం, ప్రభుత్వ ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి నిర్విరామంగా చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి ఫార్మా కంపెనీ ద్వారా రూ.2.9 కోట్ల పరిహారం అందేలా కృషి చేశారు.అనంతరం చిన్నగూడెం గ్రామంలోని చెన్ను నాగిరెడ్డి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి, ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. తీవ్ర వేదనలో ఉన్న కుటుంబ సభ్యులను చూసి చలించిన ఆయన వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు."మీ కుటుంబ సభ్యులకు ఎప్పుడు, ఎక్కడ, ఏ ఆపద వచ్చినా మీ పెద్దన్నగా నేను వెన్నుదన్నుగా ఉంటాను" అంటూ బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. కుటుంబం ఈ విషాదం నుంచి కోలుకునే వరకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, ప్రజా వాయిస్ ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో చీఫ్ నడ్డి శివకృష్ణ యాదవ్ం, పెద్దవూర మాజీ ఎంపీపీ చెన్ను అనురాధ సుందర్ రెడ్డి, పెద్దగూడెం సర్పంచ్ పోశం రమణమ్మ కోటిరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లోజు శ్రీనివాసాచారీ,గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ ఈదమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ప్రముఖులకు ఆహ్వానం

- 28, 29, 30 తేదీల్లో హాలియాలో ఘనంగా మహోత్సవం
- మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకుల విజ్ఞప్తి

**ప్రజా వాయిస్, హాలియా,** ఆగస్టు 23 : హాలియా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సాయి ప్రతాప్ నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ ఈదమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 28, 29, 30 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.మహోత్సవ ఏర్పాట్లలో భాగంగా హాలియా మున్నూరు కాపు సంఘం నిర్వాహకులు పలువురు ప్రముఖులను కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, హాలియా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్, కౌన్సిలర్లు కుందూరు వెంకటరెడ్డి, చిట్టిపోలు కర్ణసాగర్, చెరుకుపల్లి ముత్యాలు, నకిరేకంటి సైదులులను కలిసి మహోత్సవానికి ఆహ్వానించారు.అదేవిధంగా హాలియా ఎస్ఐ సతీష్, సీఐ, హాలియా మున్సిపల్ కమిషనర్‌ను కూడా నిర్వాహకులు కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ శ్రీ ఈదమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దకాపు బండి మోహన్, హాలియా పట్టణ అధ్యక్షులు గోపిశెట్టి నరసింహ, కేసాని యాదయ్య, అన్నెబోయిన చిల్లన్, గోపిశెట్టి సైదులు, లోకసాని వెంకటయ్య, సురుగు నారాయణ, కేసాని ఆంజనేయులు, గోపిశెట్టి సత్యనారాయణ, లోకసాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# తినే తిండి కల్తీ.. కొనే వస్తువులు కల్తీ!

- పాలు నుంచి పప్పుల వరకు..ఏది స్వచ్ఛమో చెప్పలేని పరిస్థితి
- లాభాల కోసం ప్రజల ఆరోగ్యంతో వ్యాపారుల చెలగాటం
- నామమాత్రపు తనిఖీలతో అక్రమార్కులకు అడ్డు అదుపు కరువు
- ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులదే
- కల్తీకి చెక్ పెట్టకపోతే భవిష్యత్ తరాల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం




**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ దందా రోజు రోజుకూ విస్తరిస్తోంది. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి నిద్రించే వరకు మనిషి వినియోగించే అనేక నిత్యావసర వస్తువుల్లో నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆహార పదార్థాల నుంచి పాలు, నూనెలు, మసాలాలు, స్వీట్లు, పండ్లు, కూరగాయలు, ప్యాకేజ్డ్ వస్తువుల వరకు కల్తీకి గురవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.కొంతమంది వ్యాపారులు అధిక లాభాల కోసం నిబంధనలను పక్కనపెట్టి నాసిరకం పదార్థాలను విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో తనిఖీలు ముమ్మరం కావాల్సి ఉండగా, కొన్ని సందర్భాల్లో మాత్రమే అధికారులు తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయి.

## తనిఖీలు ఎక్కడ?

ఆహార భద్రతకు సంబంధించిన శాఖలు, సంబంధిత అధికారులు నిరంతరం మార్కెట్లను పరిశీలించాల్సిన అవసరం ఉంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు మరింత ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే కల్తీని కేవలం వ్యాపార నేరంగా కాకుండా ప్రజారోగ్య సమస్యగా పరిగణించాల్సిన అవసరం ఉంది.

## అధికారులు మేల్కొనాలి

కల్తీ దందాపై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతో పాటు, తరచూ మార్కెట్ ప్రాంతాలను పర్యవేక్షించాలి. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. స్వాధీనం చేసుకున్న కల్తీ పదార్థాలు, నమోదైన కేసులు, తీసుకున్న చర్యల వివరాలను ప్రజలకు వెల్లడిస్తే అధికారులపై నమ్మకం మరింత పెరుగుతుంది.ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వ బాధ్యత. అధికారులు కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు స్పందించడం కాకుండా ముందస్తు నిఘాను పెంచాల్సిన అవసరం ఉంది.



## కొండచిలువను సురక్షితంగా పట్టుకున్న అటవీ శాఖ సిబ్బంది

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ గ్రామంలో ఒక ఇంట్లోకి కొండచిలువ ప్రవేశించడంతో అటవీ శాఖ రెస్క్యూ బృందం తక్షణమే స్పందించింది. రెస్క్యూ పరికరాల సహాయంతో ఎలాంటి హాని కలగకుండా కొండచిలువను సురక్షితంగా బంధించారు. అనంతరం దీనిని సమీప రక్షిత అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కొండచిలువలు కనిపిస్తే హాని చేయకుండా వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజనల్ రేంజ్ అధికారి అస్మా, ఫారెస్ట్ బీట్ అధికారి సతీష్, యానిమల్ ట్రాకర్స్ రాజు, రామయ్య, నందు నాయక్, వసంత్ పాల్గొన్నారు

## ఉలిక్కిపడిన జిల్లా యువకుడి కిడ్నాప్ కలకలం

- యువకుల హల్ చల్
- కిడ్నాప్ కు యత్నంగ్రామస్తులు అడ్డుకోవడంతో పారిపోయిన యువకులు

**ప్రజా వాయిస్ ఆగస్టు** 23 నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గుడ్లనర్వలో కలకలం స్కార్పియోలో వచ్చి యువకుడిని బలవంతంగా తీసుకెళ్లేందుకు యత్నంపాలెం గ్రామానికి చెందిన బాగానీ రాజు(18)ను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నం చేసి గ్రామ ప్రజల చేతిలో దొరికిన ఘటన కలకలం రేపుతోందిసెంట్రింగ్ పని చేస్తున్న సమయంలో యువకుడిపై ముగ్గురు దాడికి యత్నించిజావేద్, నాని, బాబిలు యువకుడిని తీసుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు గ్రామస్తులు అడ్డుకోవడంతో రాజును అక్కడే వదిలి పరారైన యువకులుకిడ్నాప్‌కు యత్నించిన ముగ్గురితో పాటు మరో ముగ్గురు ఉన్నట్లు సమాచారంయువకులు గంజాయి మత్తులో ఉన్నట్లు గ్రామస్తుల అనుమానంఘటనపై బిజినేపల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదుకేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులుఘటనకు సంబంధించిన పూర్తి వివరాలకొరకు పోలీసుల దర్యాప్తు కొనసాగుతుంది





FIRST INFORMATION REPORT
(Under section 173 and 176 BNSS)
T.S.P.M.
1. District Nagarkurnool P.S. Bijinapally Year 2026 FIR No. 222/2026 Date
2. Acts & Sections(s): 118(1),351(2) r/w 3(5) BNS
3.(a) Occurrence of Offence: Day Saturday Date & Time From 22-08-2026
Date & Time To Prior To Time Period
(b) Information Received at P.S.: Date & Time 22-08-2026 21:00:00
General Diary Reference: Entry No 13 Date & Time 22-08-2026 21:05
Type of Information: Written
Place of Occurrence:
(a) Distance and Direction From P.S.: Beat No. 2
(b) Address Place Gudlanarva Village Area/Mandal Bijinapally Street/Village Gudl

## ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్

- స్వర్గీయ గడ్డం శైలజ జ్ఞాపకార్థం రూ.2.50 లక్షలతో నిర్మాణం
- ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్


**ప్రజా వాయిస్/మోమిన్‌పేట్:** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం స్వర్గీయ గడ్డం శైలజ జ్ఞాపకార్థం రూ.2.50 లక్షల సొంత నిధులతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదివారం నాడు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ బస్టాండ్‌లో నీడ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బస్‌షెల్టర్ నిర్మించడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ఇలాంటి కార్యక్రమాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. బస్‌షెల్టర్‌ను నిర్మించిన మోమిన్‌పేట్ సర్పంచ్ సంధ్య సుభాష్ గౌడ్‌ను అభినందించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్ యాదవ్, వికారాబాద్ డిపో మేనేజర్ నమ్రుత, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, నాయకులు మహంత్ స్వామి, ఏ.రాజ్‌పాషా, మైపాల్, వేమారెడ్డి, అప్సర్, సోమారపు రవి, సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి మల్లేశం గౌడ్, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## చెరువులను తలపిస్తున్న పుట్టపాక దారులు

- నరకం చూస్తున్న గ్రామస్తులు

**ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం**:యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాకలో గట్టుప్పల్ రోడ్డు నుంచి పద్మశాలి కళ్యాణ మండపం వైపు వెళ్లే మార్గం ఇటీవలి వర్షాలకు పూర్తిగా బురదమయంగా మారింది. ప్రధాన రహదారిపై పెద్దఎత్తున నీరు నిలిచిపోవడంతో రాకపోకలు స్తంభించిపోయాయి.ద్విచక్ర వాహనాలు జారి కిందపడుతుండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. బురద కారణంగా వృద్ధులు, మహిళలు, పాఠశాల విద్యార్థులు నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.నిల్వ ఉన్న మురుగు నీటి వల్ల దోమలు పెరిగి విషజ్వరాలు వ్యాపించే ముప్పు ఏర్పడింది.రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారడంతో స్థానిక చిరు వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి.అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



# దోమల దండయాత్ర.. ప్రజారోగ్యానికి ముప్పు

- వర్షాలతో పెరిగిన బెడద..
- పారిశుధ్య లోపాలపై ప్రజల ఆగ్రహం
- ఫాగింగ్ తోనే సరిపోదు.. నిల్వ నీటిపై నిఘా అవసరం

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వర్షాకాలం మొదలైనప్పటి నుంచి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణాల్లో దోమల బెడద పెరుగుతోంది. వర్షాలకు తోడు డ్రైనేజీలు, ఖాళీ స్థలాలు, చెత్తాచెదారం, నీటి నిల్వలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో ఇళ్లలోకి దోమలు గుంపులుగా వస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

### నిల్వ నీరే ప్రధాన సమస్య

వర్షం కురిసిన తర్వాత ఇళ్ల పరిసరాలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ పాత్రలు, కూలర్లు, నీటి ట్యాంకులు తదితరాల్లో నీరు నిల్వ ఉంటే దోమల వృద్ధికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. ముఖ్యంగా డెంగ్యూ వ్యాప్తికి కారణమయ్యే ఏడెస్ ఈజిప్టి దోమలు చిన్నచిన్న నీటి నిల్వల్లోనూ పెరుగుతాయని జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్ సి డి సి) స్పష్టం చేస్తోంది. వర్షాకాలం అనంతరం దోమల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో ముందస్తు నియంత్రణ చర్యలు కీలకమని నిపుణులు సూచిస్తున్నారు.

### ఫాగింగ్ ఎక్కడ?

దోమల బెడద పెరుగుతున్నా కొన్ని ప్రాంతాల్లో ఫాగింగ్, లార్వా నియంత్రణ, డ్రైనేజీల శుభ్రత వంటి చర్యలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే ఫాగింగ్ ఒక్కటే శాశ్వత పరిష్కారం కాదు. ఎన్ సి డి సి మార్గదర్శకాల ప్రకారం దోమల పెంపక కేంద్రాలను గుర్తించి నీటి నిల్వలను తొలగించడం, లార్వా నియంత్రణ, అవసరమైన చోట్ల మాత్రమే స్పేస్ స్ప్రే వంటి చర్యలను సమన్వయంగా చేపట్టాలి.

### వ్యాధులపై అప్రమత్తత

దోమల నియంత్రణలో నిర్లక్ష్యం చేస్తే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల ముప్పు పెరగవచ్చు. భారీ వర్షాల తర్వాత నిల్వ నీటిలో ఏడెస్ దోమల వృద్ధి వేగం పెరిగే అవకాశం ఉందని ఎన్ సి డి సి పేర్కొంది. వరదలు లేదా భారీ వర్షాల తర్వాత దోమలపై లార్వా, అడల్ట్ సర్వైలెన్స్‌ను పెంచాల్సిన అవసరం ఉందని కూడా సూచించింది.

### పల్లె.. పట్టణం తేడా లేకుండా

గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థలు సక్రమంగా లేకపోవడం, పట్టణాల్లో ఖాళీ స్థలాలు, చెత్త కుప్పలు, నిర్మాణ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటం సమస్యను మరింత పెంచుతున్నాయి. దీంతో స్థానిక సంస్థలు, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. దోమల నియంత్రణకు పర్యావరణ నిర్వహణ, లార్వా నియంత్రణ, నిరంతర నిఘా, ప్రజల భాగస్వామ్యం కీలకమని ఎన్ సి డి సి కూడా పేర్కొంటోంది.

### ప్రజలూ భాగస్వాములు కావాలి

ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటం, కూలర్లు–ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం, పనికిరాని టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ వస్తువులను తొలగించడం ద్వారా దోమల వృద్ధిని గణనీయంగా తగ్గించవచ్చు. నీటి నిల్వ పాత్రలను మూతపెట్టాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

### ఇప్పటికైనా మేల్కొనాలి



జిల్లాలో దోమల బెడదపై స్థానిక సంస్థలు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాలు, పట్టణాల్లో హాట్‌స్పాట్‌ల గుర్తింపు, నిల్వ నీటి తొలగింపు, లార్వా సర్వే, అవసరమైన ప్రాంతాల్లో ఫాగింగ్, డ్రైనేజీల శుభ్రత, ప్రజలకు అవగాహన వంటి చర్యలను నిరంతరం చేపట్టాల్సిన అవసరం ఉంది.దోమ కనిపించిన తర్వాత మందు కొట్టడం కంటే.. దోమ పుట్టే చోటును ముందే తొలగించడం సమర్థమైన మార్గం. జిల్లాలో ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపడతారా.. లేక వ్యాధులు ప్రబలిన తర్వాత మేల్కొంటారా అనేది వేచి చూడాలి.



## తెలంగాణలో కాంగ్రెస్ పని అయిపోయింది ..రాబోయేది బిజెపి ప్రభుత్వమే

- పరకాల అడ్డా బిజెపి ది
- పరకాల సీటు కోసం తన్నుకుంటున్నారు
- తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అభివృద్ధి చేయడం మరిచి దోచుకు తింటున్నారు
- బిజెపి జాతీయ కౌన్సిల్ మెంబర్ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** తెలంగాణలో కాంగ్రెస్ పని అయిపోయిందని. రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకోవడమే తప్ప అభివృద్ధి మరిచిందని తీవ్రంగా విమర్శించారు. ఆదివారం ఆత్మకూరు మండలం గూడేప్పా డు క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ పరకాల నియోజక వర్గం మొదటి నుంచి బిజెపి దే ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం మరిచి దోచుకోవడం. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. పరకాల నియోజకవర్గం నాది అడ్డ అంటే నాది అడ్డ అంటూ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కూతురు కొండ సుష్మిత పటేల్ నాది అంటూ కుమ్ములాడుకుంటున్నారని దుయ్యబెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అధికారం కొచ్చినప్పటి నుండి అభివృద్ధి కంటే ఎక్కువ దోపిడీ జరుగుతుందని విమర్శించారు. మహిళలకు 2500 ఇవ్వటం లేదు వృద్ధులకు 4000 పింఛన్లు ఇవ్వడం లేదు గీత నేత కార్మికులకు ఒంటరి మహిళకు పింఛన్ ఇచ్చేది ఎప్పుడు అని ప్రశ్నించారు. నాడు టిఆర్ఎస్ నేతలు కుటుంబ పాలనలో రాష్ట్రాన్ని దోచుకుంటే నేడు రేవంత్ రెడ్డి పాలనలో అంతకంటే ఎక్కువ దోచుకుంటున్నారని తెలంగాణ ప్రజలు రెండు పార్టీలను చీదరించుకుంటున్నాయన్నారు తెలంగాణలో రాబోయేది బిజెపి పార్టీ నేనని ప్రజలు కోరుకుంటున్నారని గుజ్జుల ప్రేమందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలారా కాంగ్రెస్కు బుద్ధి చెప్పవలసిన సమయం ఆసన్నమైందన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి జెండా ఎగురవేస్తామన్నారు. బి ఆర్ ఎస్ కాంగ్రెస్ నేతల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టిముప్పుల రాంబాబు, హనుమకొండ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, బిజెపి జిల్లా నాయకులు రతన్ కుమార్, రాయిరాకుల మొగిలి, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగల్లు శ్రీకాంత్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రవ్వ శివప్రసాద్, సర్దార్లు పాల్గొన్నారు.

## నాటి వార్త.... నేటి నిజం..

- చందాపూర్ పారిశ్రామిక వాడలో పట్టుబడిన గంజాయి
- పోలీసులకు తెలియకుండా పరిశ్రమ యజమాన్యం పోలీసులకు మామూలు
- ప్రత్యేక చర్యలు చేపట్టిన గంజాయి సరఫరా ఎలా..?

**ప్రజా వాయిస్ సంగారెడ్డి :** హత్నూర మండల పరిధిలోని చంద్రపూర్ పారిశ్రామిక ప్రాతం లోని పరిశ్రామిక ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. దీనిపై గత 20 రోజుల క్రితమే చందాపూర్ పారిశ్రామిక ప్రాంతంలో గంజయి అమ్మ కాలు జోరు గా కొనసాగుతున్నాయి అనే శీర్షికతో ప్రచురితమైన కథనం వాస్తవం అనే దానికి నిదర్శనం. ఏదైనా వాస్తవాలను మాత్రమే ప్రజా వాయిస్ పత్రిక నించాలని మాత్రమే బయటపెడుతుంది. పోలీస్ అధికారులు, ఎక్సైజ్ సిబ్బంది ముడుపులు తీసుకొని చూసిచూడనట్లుగా ఉండొచ్చు కానీ తమకు తెలిసిన సమాచారాన్ని మాత్రం ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా పనిచేస్తుంది ప్రజా వాయిస్. దీనికి నిదర్శనమే ఇటీవల హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని ఒక పారిశ్రామా వద్ద ఉన్న హోటల్లో రెండు కిలోల గంజాయి లభించడం చూస్తే ప్రజా వాయిస్ లో వచ్చిన కథనం వాస్తవమే అనేదానికి నిదర్శనం. దీనిపై హత్నూర ఎస్ఐ తో పాటు నర్సాపూర్ ఎక్సైజ్ అధికారులకు గురువారమే ఉదయం సమా చారం ఇచ్చిన స్పందించలేదు. కానీ వాస్తవానికి బీహార్ చెందిన వివిధ పరిశ్రమలలో పనిచేసే కార్మికులు వచ్చేముందు పెద్ద ఎత్తున గజ్జయి తీసుకువచ్చి తల ఇంత పంపకలు జరుపుకున్నట్లు సమాచారం. అందులో భాగంగానే గత మూడు రోజులు క్రితం చందాపూర్ శివార్లులో గంజాయి బయటపడిన ఓ పరిశ్రమ యజమాని( సిబ్బంది) విషయం బయటపడకుండా గోపెంగ ఉంచా రు. ఇదే అంశాన్ని ప్రజా వాయిస్ బయటపెట్టింది. కానీ అధికారులు స్పందించకపోవడంతో అసలు విషయం బయటపడింది. కానీ పారిశ్రామిక వాడలో గంజాయి అమ్ముతున్నారంటే అధికారులు అలాంటిది ఏమీ లేదు తప్పుడు వార్తలు రాస్తున్నారంటూ హెచ్చరికలు చేస్తున్నారు. కానీ ఇప్పుడు అసలు విషయం బయటపడింది. ప్రజా వాయిస్ లో ప్రచురితం అయినా వార్త వాస్తవమే అనేది వాస్తవమే స్పష్టమైనది.





ప్రజా వాయిస్
చందాపూర్ పారిశ్రామికవాడలో గంజాయి అమ్మకాల జోరు



# వయసు కాదు.. ప్రజల పిలుపే ముఖ్యం

- యువ నాయకులతో పోటీకి నేనున్నా
- మిర్యాలగూడలో ఎమ్మెల్యే బత్తులతో, మాజీ మంత్రి జానారెడ్డి సందడి
- యువ నాయకులతో పోటీగా పలు వివాహాది కార్యక్రమాలకు హాజరై ప్రజలతో మమేకం
- నాకు వయసు అయిపోలేదు అనే సందేశాన్ని చాటిన సీనియర్ కాంగ్రెస్ నేత

**ప్రజా వాయిస్, మిర్యాలగూడ:** వయసు పెరిగినా ప్రజలతో అనుబంధం తగ్గదని, ఆహ్వానం వస్తే కార్యక్రమాలకు హాజరై ప్రజల ఆనందంలో భాగస్వామ్యం కావడమే తనకు ఇష్టమనే సందేశాన్ని మాజీ మంత్రి, మాజీ సీఎల్పీ నేత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుందూరు జానారెడ్డి మరోసారి చాటిచెప్పారు. మిర్యాలగూడ నియోజకవర్గం వ్యాప్తంగా ఆదివారం జరిగిన పలు వివాహాది శుభకార్యాల్లో పాల్గొని ఆయన సందడి చేశారు."ఎవరైనా ఆహ్వానించారా.. నేను వస్తున్నా.. వయసు పేరుతో ఇంటికే పరిమితం కావాల్సిన అవసరం లేదు. యువ నాయకులతో పోటీగా ప్రజల మధ్య తిరిగే ఉత్సాహం, శక్తి ఇంకా నాలో ఉంది" అన్నట్టుగా జానారెడ్డి వరుస కార్యక్రమాల్లో పాల్గొనడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరైన జానారెడ్డి, నూతన వధూవరులను ఆశీర్వదించి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ, ఆహ్వానించిన వారి శుభకార్యాల్లో పాల్గొనడం ఆయనకు ప్రజలతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని మరోసారి గుర్తు చేసింది.ఈ కార్యక్రమాల్లో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) కూడా పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో జానారెడ్డి, బీఎల్ఆర్‌లను స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆప్యాయంగా పలకరించారు.సీనియర్ నాయకుడైనా ప్రజా కార్యక్రమాలకు దూరంగా కాకుండా, యువ నాయకులకు ఏమాత్రం తగ్గకుండా వరుసగా కార్యక్రమాల్లో పాల్గొంటూ "ఇంకా నా ప్రయాణం ఆగలేదు.. ప్రజల పిలుపు ఉన్నంతకాలం నేను ప్రజల మధ్యే ఉంటా" అనే భావనను జానారెడ్డి తన పర్యటనల ద్వారా స్పష్టంగా చాటుతున్నారని ఆయన అభిమానులు పేర్కొంటున్నారు.వయసు కేవలం సంఖ్య మాత్రమే.. ప్రజల మధ్య ఉండాలనే ఉత్సాహమే అసలైన శక్తి అన్నట్లుగా మిర్యాలగూడలో జానారెడ్డి చేసిన సందడి ఇప్పుడు ప్రత్యేక చర్చకు దారితీస్తోంది. యువ నాయకులతో పోటీగా కార్యక్రమాలకు హాజరవుతూ, ప్రజలతో మమేకమవుతున్న ఆయన జోష్ చూసి అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





# గుంత పూడ్చకపోవడంతో ప్రమాదాలు

- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

**ప్రజా వాయిస్ కగజ్ నగర్** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో తిరందాజ్ టాకీస్ సమీపంలోని సంగీత మొబైల్ ఎదురుగా మిషన్ భగీరథ పనుల కోసం తవ్విన గుంతను 15 రోజులుగా పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితమే ప్రజలు దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదు.ఈరోజు అదే గుంతలో ఇద్దరు పడిపోయారు. టర్నింగ్ వద్ద ఉండటంతో వాహనదారులకు, పాదచారులకు ప్రమాద ముప్పు పొంచి ఉంది. పెద్ద ప్రమాదం జరగకముందే గుంతను పూడ్చి భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆహార భద్రత లెక్కలు... అంతులేని మాయాజాలం!

- కార్డు తీసేస్తే ప్రభుత్వం కూలుతుందా?
- ఓటు బ్యాంకు భయంతో పాలకుల సంకెళ్లు!
- ప్రక్షాళన లేకుండా 'స్మార్ట్ కార్డుల' పంపిణీ?
- పాత దోపిడీకి సరికొత్త డిజిటల్ రంగు!
- పేదరిక రేటును మించిన రేషన్ కార్డులు:
- ఇది సంక్షేమమా? అసలైన దోపిడీనా?
- రాష్ట్ర జనాభాలో 75%మంది పేదలేనా?
- వాస్తవ పేదరికానికి, రికార్డుల లెక్కలకు పొంతనేది?




**ప్రజా వాయిస్ ఖమ్మం:** ఆకలి లేని సమాజ నిర్మాణం పేరిట ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'మనిషికి 6 కిలోల ఉచిత సన్నబియ్యం' పథకం ఒక గొప్ప సంక్షేమ ఆశయం. ధనికులు తినే నాణ్యమైన బియ్యాన్ని నిరుపేదల ముంగిటకు చేర్చాలన్న ప్రభుత్వ సంకల్పం ప్రశంసనీయమే అయినా, క్షేత్రస్థాయిలో అది అక్రమార్కుల పాలిట కామధేనువుగా మారుతోంది. "అనర్హులను ఏరిపారేస్తాం... అర్హులైన నిరుపేదలకే సంక్షేమం అందిస్తాం" అని పాలకులు వల్లించే ప్రకటనలు కేవలం మాటలకే పరిమితమవుతున్నాయి. ఏళ్ల తరబడి పేరుకుపోయిన అనర్హుల జాబితాను ప్రక్షాళన చేయకుండా, హడావుడిగా కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టడం అంటే పాత దోపిడీకి డిజిటల్ రంగు పూయడమేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రంలో ఆహార భద్రత కార్డుల ముసుగులో జరుగుతున్న ఆర్థిక నష్టం అంచనాలను పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 89 నుంచి 90 లక్షలకు పైగా ఆహార భద్రత (తెల్ల) కార్డులు చలామణిలో ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు 2.8 కోట్ల నుంచి 3 కోట్ల మంది లబ్ధిదారులుగా నమోదై ఉన్నారు. అంటే రాష్ట్ర మొత్తం జనాభాలో దాదాపు 70 శాతం నుంచి 75 శాతానికి పైగా ప్రజలు తెల్ల రేషన్ కార్డుల పరిధిలోనే ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. వాస్తవ పేదరిక శాతానికి, ఈ భారీ కార్డుల సంఖ్యకు ఏమాత్రం పొంతన లేకపోవడమే వ్యవస్థాగత లోపానికి నిదర్శనం.

వివిధ నివేదికలు, క్షేత్రస్థాయి పరిశీలనల ప్రకారం ఈ మొత్తం కార్డుల్లో దాదాపు 20 శాతం నుంచి 25 శాతం వరకు అనర్హులే ఉన్నారని స్పష్టమవుతోంది. అంటే సుమారు 15 లక్షల నుంచి 20 లక్షల కుటుంబాలు ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, సొంత కార్లు, ఐదు ఎకరాలకు పైగా భూములు ఉన్న సంపన్నులేనని అంచనా. సగటున ఒక కుటుంబానికి నెలకు 18 నుంచి 24 కిలోల చొప్పున లెక్కిస్తే, కేవలం ఈ అనర్హుల కార్డుల ద్వారానే ప్రతి నెలా సుమారు 35,000 నుంచి 40,000 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పక్కదారి పడుతోంది.

ప్రభుత్వం సన్నబియ్యం సేకరణ, ప్రాసెసింగ్, రవాణా కోసం కిలోకు సుమారు రూ. 38 నుంచి రూ. 42 వరకు ఖర్చు చేస్తోంది. ఈ లెక్కన అనర్హుల కోటా వల్ల ప్రతి నెలా ప్రభుత్వ ఖజానాపై దాదాపు రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్ల వరకు అదనపు భారం పడుతోంది. సంవత్సరానికి ఇది ఏకంగా రూ. 1,800 కోట్ల నుంచి రూ. 2,400 కోట్ల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోంది.

ఈ భారీ దోపిడీ ఇంత నిరాటంకంగా సాగడానికి మూలకారణం స్థానిక రాజకీయాల్లో వేళ్లూనుకున్న సంకుచిత 'ఓటు బ్యాంకు' విధానమే. క్షేత్రస్థాయిలో వార్డు మెంబర్ల నుంచి ప్రజాప్రతినిధుల వరకు తమ పార్టీ సానుభూతిపరులు లేదా సొంత సామాజిక వర్గానికి చెందిన వారి పేర్లు అనర్హుల జాబితాలో ఉన్నా "మావాడు... మా పార్టీ... మా కులం... వాళ్ల కార్డులు ఎలా తీసేస్తారు?" అంటూ అడ్డుగోడగా నిలుస్తున్నారు.

రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లినప్పుడు "మా కార్యకర్తల జోలికొస్తే బదిలీ చేయిస్తాం", "వారంతా మా ఓటర్లే" అంటూ బెదిరింపులకు దిగడం సర్వసాధారణమైంది. దాంతో వివాదాలు ఎందుకని భావించే కొందరు అధికారులు క్షేత్రస్థాయి వాస్తవాలను పక్కనపెట్టి, రికార్డులను కాగితాలపైనే సరిచేసి పైపై నివేదికలు ఇచ్చేస్తున్నారు. "కార్డు తొలగిస్తే ఓటు పోతుందా? ప్రభుత్వం కూలిపోతుందా?" అన్న భయంతోనే పాలకులు సైతం కఠిన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు.





# నేడే జిల్లాలో మంత్రుల పర్యటన

- రూ.474.82 కోట్లతో రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- ఈ రహదారులు అభివృద్ధి పనులు పూర్తయితే ఆయా ప్రాంతాలలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయి
- గ్రామాలు, మండల, కేంద్రాలు ప్రధాన పట్టణాల మధ్య ప్రయాణం సులభతరం

**ప్రజా వాయిస్.. వనపర్తి** నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం పర్యటించనున్నారు.పర్యటనలో భాగంగా మొత్తం రూ.474.82 కోట్ల అంచనా వ్యయంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ( హెచ్ ఏ ఎం ) తొలి దశ ప్యాకేజీల కింద చేపట్టనున్న పలు రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూర్‌లో రూ.146.71 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు హెచ్ ఏ ఎం ) రహదారి పనులకు మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో అమ్రాబాద్–ఇప్పలపల్లి రహదారి బలోపేతం, బల్మూర్–నాగర్‌కర్నూల్ పీడబ్ల్యూడీ రహదారి విస్తరణ, అచ్చంపేట–రాకొండ రహదారి విస్తరణ పనులు ఉన్నాయి.అనంతరం వనపర్తిలో కర్నెతండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. ఆ తర్వాత కొల్లాపూర్ నియోజకవర్గంలోని దావాజిపల్లిలో రూ.41.75 కోట్లు, వీపనగండ్లలో రూ.30.01 కోట్లు, పెద్దదగడలో రూ.45.60 కోట్లు, చిన్నంబావిలో రూ.39 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.పెంట్లవెల్లి మండలంలో రూ.171.75 కోట్ల అంచనా వ్యయంతో ఏడు రహదారి అభివృద్ధి పనులకు భూమిపూజ చేయనున్నారు.పెంట్లవెల్లి–వనపర్తి,పెంట్లవెల్లి–శ్రీరంగాపూర్,పెద్దకార్పాముల–అంబట్పల్లి,రాజాపూర్–ఏదుల, కొల్లాపూర్–లింగాల, తీగలపల్లి–ఏదుల, షనాయిలపల్లి–గౌరెడ్డిపల్లి రహదారుల విస్తరణ, బలోపేతం పనులు ఇందులో ఉన్నాయి.ఈ రహదారి అభివృద్ధి పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు గ్రామాలు, మండల కేంద్రాలు, ప్రధాన పట్టణాల మధ్య ప్రయాణం సులభతరం కానుంది.రహదారుల అభివృద్ధితో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమానికి ఆయా జిల్లాల మండలాల అధికారులు ప్రజాప్రతినిధులు హాజరవుతారు

# మడిపల్లి హత్య కేసులో సర్పంచ్ సహ మరో వ్యక్తి అరెస్ట్

**తొర్రూర్ ప్రజా వాయిస్ మహబూబాబాద్** జిల్లా తొర్రూర్ మండలం మడిపల్లి గ్రామంలో ఈ నెల 19వ తేదీన జరిగిన గుంటుక రమేష్ హత్య కేసులో దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు, కేసులో నిందితుల పాత్రపై విచారణ అనంతరం ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అదే గ్రామ సర్పంచ్ రామలింగంతో పాటు కాయిత నరేష్‌ను ఈ రోజు అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కేసుకు సంబంధించి మరికొంతమందిని కూడా విచారిస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



# భక్తులతో కిక్కిరిసిన ఏడుపాయల దేవస్థానం

- అమ్మవారిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో భక్తులు
- అమ్మవారికి ఓడి బియ్యం బోనాలు సమర్పింపు

**ప్రజా వాయిస్, పాపన్నపేట** పాపన్నపేట మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఏడుపాయల వనదుర్గ భవాని దేవస్థానం నందు ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో రావడం జరిగింది. అనంతరం భక్తులు మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమైన ఏడుపాయల వనదుర్గమ్మకు బోనాలు, ఓడి బియ్యం, తలనీలాలు, సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. శివశక్తుల పూనకాల మధ్య ఏడుపాయల ప్రాంగణం దద్దరిల్లిపోయింది. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏడుపాయల కార్యనిర్వహణ అధికారి తగు జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడుపాయల సిబ్బంది, మరియు ఆలయ అర్చకులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ ఫేజ్–2పై బీఎల్ఏలకు అవగాహన

**ప్రజా వాయిస్ మంథని** పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని పాలకుర్తి, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని మండలాలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లకు (బి ఎల్ ఏ) ఎస్ఐఆర్ (ఎస్ ఐ ఆర్) ఫేజ్–2 ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంథని మంత్రి శ్రీధర్‌బాబు క్యాంపు కార్యాలయంలో టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు స్క్రీన్ ద్వారా సమగ్రంగా వివరించారు.ఫేజ్–2లో చేపట్టాల్సిన ప్రక్రియ, బూత్ స్థాయిలో బీఎల్ఏల బాధ్యతలు, ఓటర్ల వివరాల పరిశీలన, ఓటరు జాబితాలో తప్పులు, మార్పులు, సవరణలను గుర్తించే విధానాన్ని ప్రదర్శన ద్వారా వివరించారు. ఓటరు జాబితా సక్రమంగా ఉండేలా బీఎల్ఏలు బాధ్యతగా పనిచేయాలని సూచించారు.



# భద్రాచలంలో బిల్లులు లేని 52 అబార్షన్ కిట్లు స్వాధీనం

- బిల్లులు లేకుండా నిల్వ చేసిన 52 ఎంటీపీ కిట్లు స్వాధీనం
- రూ.23,296 విలువైన 'ఏ-కేర్' కిట్లను సీజ్ చేసిన అధికారులు
- మూడు రోజులుగా భద్రాచలంలో మెడికల్ షాపులపై తనిఖీలు
- డీహెచ్ ఎంఓ పర్యవేక్షణపై తలెత్తుతున్న ప్రశ్నలు
- సరఫరా మూలాలపై దర్యాప్తు.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**ప్రజా వాయిస్ భద్రాచలం** భద్రాచలంలో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసినట్లు అనుమానిస్తున్న అబార్షన్ కిట్లు బయటపడటం కలకలం రేపుతోంది. పట్టణంలోని ఓ హోల్‌సేల్ మెడికల్ షాపులో కొనుగోలు బిల్లులు లేకుండా నిల్వ చేసిన 52 మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) కిట్లను టీజీ సేఫ్–డ్రగ్స్ విభాగం అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఖమ్మం అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. అరవింద్ కుమార్, భద్రాద్రి–కొత్తగూడెం డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ జి. అశ్వని పర్యవేక్షణలో అధికారులు మెడికల్ షాపుపై తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో 'ఏ–కేర్ కిట్'కు చెందిన 52 ఎంటీపీ కిట్లు బిల్లులు లేకుండా నిల్వ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.23,296 ఉంటుందని అధికారులు తెలిపారు. కిట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు వాటి నుంచి నమూనాలను సేకరించారు. నమూనాల పరీక్షా నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

### మూడు రోజులుగా విస్తృత తనిఖీలు...

భద్రాచలంలో గర్భస్రావానికి ఉపయోగించే మాత్రలు, కిట్లను నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు రావడంతో అధికారులు తనిఖీలను ముమ్మరం చేసినట్లు సమాచారం. గత మూడు రోజులుగా పట్టణంలోని పలు మెడికల్ షాపులు, వైద్యశాలలు, ఔషధ విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది.ఈ తనిఖీల్లో మందుల విక్రయాలకు సంబంధించిన అనుమతులు, కొనుగోలు బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు, మందుల నిల్వలు, ఇతర రికార్డులను అధికారులు పరిశీలించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఓ హోల్‌సేల్ మెడికల్ షాపులో భారీగా బిల్లులు లేని ఎంటీపీ కిట్లు బయటపడటం చర్చనీయాంశంగా మారింది.

### డీహెచ్ ఎంఓ పర్యవేక్షణపై ప్రశ్నలు...

భద్రాచలంలో గర్భస్రావానికి సంబంధించిన మందులు, కిట్ల విక్రయాలపై ఆరోపణలు గతంలోనూ వినిపించిన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డీహెచ్ఎంఓ) పర్యవేక్షణపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మెడికల్ షాపులు, ప్రైవేట్ వైద్యశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా ఔషధాల విక్రయాలు జరుగుతున్నాయా? అనుమతి లేని మందులు లేదా కిట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి? వాటి విక్రయాలపై సంబంధిత శాఖల నిఘా ఎంతవరకు ఉంది? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చకు వస్తున్నాయి.ఒకవైపు డ్రగ్స్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించి బిల్లులు లేని కిట్లను స్వాధీనం చేసుకుంటుండగా.. మరోవైపు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా ఇటువంటి వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గర్భస్రావానికి సంబంధించిన మందుల విక్రయాలు నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయా లేదా అన్న అంశంపై సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

### అసలు సరఫరాదారులు ఎవరు?...

52 కిట్లు బిల్లులు లేకుండా ఒక హోల్‌సేల్ మెడికల్ షాపులో నిల్వ ఉండటం వెనుక వాటిని ఎవరు సరఫరా చేశారు? ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు? బిల్లులు ఎందుకు లేవు? అనే అంశాలు కీలకంగా మారాయి. కేవలం కిట్లను స్వాధీనం చేసుకోవడంతో వ్యవహారం ముగించకుండా.. వాటి సరఫరా గొలుసుపై కూడా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.అధికారులు కిట్ల నుంచి నమూనాలు సేకరించిన నేపథ్యంలో పరీక్షా నివేదిక వచ్చిన తర్వాత అసలు విషయం మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఔషధాల నాణ్యత, వాటి చట్టబద్ధమైన సరఫరా, నిల్వ, విక్రయాలకు సంబంధించిన అంశాలపై అధికారులు దర్యాప్తు చేయనున్నట్లు తెలుస్తోంది.

### కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక...

నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలను నిల్వ చేయడం, విక్రయించడం లేదా సరైన రికార్డులు లేకుండా మందుల వ్యాపారం నిర్వహించడం వంటి చర్యలను అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించినట్లు సమాచారం.భద్రాచలంలో మూడు రోజులుగా జరుగుతున్న తనిఖీల నేపథ్యంలో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయా? బిల్లులు లేని ఎంటీపీ కిట్ల వెనుక ఉన్న అసలు సరఫరాదారులపై చర్యలు ఉంటాయా? డీహెచ్ఎంఓ స్థాయిలో ఈ వ్యవహారంపై ప్రత్యేక విచారణ జరుగుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.అయితే ఈ ఘటనలో కేవలం కిట్లు నిల్వ చేసిన వ్యక్తులపైనే కాకుండా.. వాటి సరఫరా, విక్రయాలకు సంబంధించిన మొత్తం వ్యవస్థపై సమగ్ర విచారణ జరిపితేనే అసలు విషయం బయటపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# మండల కేంద్రంలోనే తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

**ప్రజలకు అందుబాటులో ఉండే చోటే ఎమ్మార్వో కార్యాలయం నిర్మించాలని డిమాండ్**

**దూర ప్రాంతంలో కార్యాలయం ఏర్పాటుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపణ**

**ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ఫైర్**

**కులాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలను ఏకం చేసి ఉద్యమిస్తామని హెచ్చరిక**

**ప్రజలకు ఇబ్బందులు కలిగితే పరిణామాలకు ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని స్పష్టం**

**జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి.**

ప్రజా వాయిస్ / కన్నెపల్లి

కన్నెపల్లి మండల కేంద్రంలోనే తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అనుబంధ అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన ప్రజా వ్యతిరేక విధానాలను మార్చుకోకపోతే కులాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి ఉద్ధృత పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రజల బాగోగుల కోసమే పాలన సాగిస్తున్నామని, రైతుల పక్షాన నిరంతరం పనిచేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మండల ప్రజలు, విద్యార్థులు, మహిళలు, రైతులకు నిత్యం అవసరమయ్యే తహసీల్దార్ కార్యాలయాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయకుండా దూర ప్రాంతంలో నిర్మించేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాన్ని మండల కేంద్రానికి దూరంగా ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే ఇటువంటి తప్పుడు నిర్ణయాలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే




విరమించుకోవాలని రత్నం తిరుపతి డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా కన్నెపల్లి మండల కేంద్రంలోనే తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని కోరారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు తమ నిర్ణయాన్ని పునరాలోచించాలని ఆయన సూచించారు. లేకపోతే ప్రజాసంఘాలు, రైతు కూలీలు, మహిళలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలను కులాలు, పార్టీలకు అతీతంగా ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రజా ఉద్యమాల ద్వారా ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నా అందుకు పూర్తిగా ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు ప్రజలకు నిజంగా సేవ చేయాలనే ఉద్దేశం ఉంటే మండల కేంద్రంలోనే తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, ప్రజల సౌకర్యాన్ని పరిగణనలోకి తీసుకుని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రత్నం తిరుపతి డిమాండ్ చేశారు.

# భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠలో ప్రభుత్వ విప్ విజయరమణారావు ప్రత్యేక పూజలు

**కాట్నపల్లి హనుమాన్ ఆలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం**

**స్వామివారిని దర్శించుకుని ప్రజలందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే**

**వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు.. భారీగా తరలివచ్చిన భక్తులు**

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

మండలంలోని కాట్నపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన నవగ్రహ, శివ పంచాయతన సహిత భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఈ మహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొని ప్రత్యేక



ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ప్రభుత్వ విప్ విజయరమణారావుకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. భక్తాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ, గ్రామాల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందడం సంతోషకరమన్నారు. భక్తాంజనేయ స్వామివారి కృపతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, శుభాలు కలగాలని ఆకాంక్షించారు. కాట్నపల్లి గ్రామ ప్రజలు ఐకమత్యంతో ఆలయ నిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో నవగ్రహ, శివ పంచాయతన సహిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గా ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పై తప్పుడు ప్రచారాలు

**పాము కాటు వల్లనే కార్మికుడు మరణించాడు అంటూ విషపూరిత ఆందోళనలు**

**పైసా వసూల్ కోసమే వ్యక్తిగత కోపాలు చూపించిన ఆందోళనకారులు**


**రంగు బహుదూర్ పటేల్ మరణం పాము కాటు కాదని తేల్చిన ప్రభుత్వ వైద్యులు..**

**గుండెపోటు కారణంగానే మరణించినట్లు పోస్టుమార్టం రిపోర్ట్**

**ఫోరెన్సిక్ రిపోర్ట్ వచ్చేదాకా ఓపిక పట్టాలి అంటూ తెలిపిన అధికారులు**

ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సింగరేణి ఓపెన్ కాస్ట్ పరిధిలో ఓబి తొలగించి బొగ్గును వెలికి తీసి సింగరేణికి ఉత్పత్తి అందించే దుర్గా ఇన్ఫ్రా మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పై గత కొద్ది కాలంగా కొంతమంది ఆందోళనకారులు పైసా వసూల్ కోసమే విషపూరిత కుట్రలు తప్పుడు ప్రచారాలు చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి మణుగూరు సింగరేణి ఓపెన్ కాస్ట్ ఏరియా ఓసి-4 దుర్గ ఇన్ఫ్రా ప్రైవేట్ కంపెనీలో లోడర్ ఆపరేటర్ గా గత కొద్ది కాలంగా పనిచేసే మధ్యప్రదేశ్ కు చెందిన రంగు బహుదూర్ పటేల్ (42) ఆగస్టు (9) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో అస్వస్థకు గురికావడం వలన అది గమనించిన తోటి సహాయకులు రంగు బహుదూర్ అనారోగ్యానికి గురైనట్లు మేనేజ్మెంట్ వారికి తెలిపారు. దాంతో అప్రమత్తమైన దుర్గా ఇన్ఫ్రా మేనేజ్మెంట్ వారు కార్మికుడని





హుటాహుటిన మణుగూరు పట్టణంలో గల ప్రవేటు దావకానలకు తరలించే ప్రయత్నం చేశారు. అయితే తెల్లవారుజాము కావడం వైద్యులు లేకపోవడం గమనించిన తోటి సహాయకులు రంగు బహుదూర్ కి వైద్య సేవలు అందించేందుకు మణుగూరు పట్టణ పరిధిలో గల వంద పడకల ప్రభుత్వ దావకానకు తరలించారు. అయితే అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు రంగు బహుదూర్ ఆరోగ్యం ఇబ్బందికరంగా ఉందని తెలపడంతో అది గమనించిన మేనేజ్మెంట్ వారు కార్మికుడిని బ్రతికించుకునేందుకు మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన భద్రాచలం ఏరియా దావకానకు తరలించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే అస్వస్థకు గురైన రంగు బహుదూర్ భద్రాచలం ఏరియా దావకానకు చేరడం వైద్యం అందక ముందే తుది శ్వాస వదలడం రంగు బహుదూర్ మరణించడం ఆందోళనకారులకు కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లు అనిపించింది. అదే అదునుగా భావించిన ఆందోళనకారులు రంగు బహుదూర్ అనే వ్యక్తి దుర్గ క్యాంప్ ఆవరణలో కట్లపాము కాటుతో మరణించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం. కార్మిక సంఘాల నేతలకు తప్పుడు సమాచారాలు అందివ్వడం. దుర్గా ఇన్ఫ్రా మేనేజ్మెంట్ వారిపై ఒత్తిడి పెంచడం పైశాచిక ఆనందం పొందడం వారి యొక్క విధి నిర్వహణగానే మారింది.

**రంగు బహుదూర్ పాముకాటుతో మరణించలేదని తెలిసిన పోస్టుమార్టం రిపోర్ట్...**

ఒక మనిషి అనుమానాస్పదంగా మరణించినప్పుడు నిజ నిజాలు తెలుసుకోవడానికి శవాన్ని వైద్య పరంగా పరీక్షించడం కోసం పోస్టుమార్టం నిర్వహిస్తారు. మరణం ఎలా జరిగిందో నిర్ధారించేందుకు వైద్యులు శవాన్ని టేబుల్ పై ఉంచి శరీరంపై ఉన్న గాయాలు, గుర్తులు, రక్తం లేదా ఇతర ఆనవాళ్లు పరిశీలిస్తారు. ప్రతిదీ ఫోటోలు తీసి వివరాలను రికార్డ్ చేస్తారు. చాతి నుండి పొత్తికడుపు వరకు సన్నగా కోత పెట్టి లోపల అవయవాలను బయటకు తీసి పరిశీలన చేస్తారు. అయితే రంగు బహుదూర్ పోస్టుమార్టం నిర్వహించిన భద్రాచలం వైద్యులు. రంగు బహుదూర్ శరీరంపై ఎక్కడ పాము కరిచినట్టు లేదని. రంగు బహుదూర్ రక్తంలో పాము విషం కనిపించలేదని భద్రాచలం వైద్యులు మాన్యువల్ రిపోర్టు రాయడం శాస్త్రీయ పరీక్షల్లో సేకరించిన ఆధారాలు నిపుణులు విశ్లేషించి నిర్ధారించి ఫోరెన్సిక్ రిపోర్ట్ వచ్చేదాకా ఓపిక పట్టాలి వైద్యులు తెలపడం విషపూరిత ప్రచారాలు చేసే వ్యక్తులకు వణుకు పుట్టిస్తుంది మరి ఇప్పటికైనా దుర్గ ఇన్ఫ్రా మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పై దుష్ప్రచారాలు చేస్తే వ్యక్తులు ఆత్మ పరిశీలన చేసుకుంటారా లేదంటే వ్యక్తిగత కక్షలతో విషపూరిత ప్రచారాలు చేస్తారా అనేది వేచి చూడాలి మరి..

# కరెంటు షాక్ తో ఆవు మృతి

**ప్రజా వాయిస్ తుర్కపల్లి/ఆగస్టు 23**

కరెంటు షాక్ తో ఆవు మృతి చెందిన సంఘటన తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జూపల్లి బాలస్వామి తన వ్యవసాయ పొలం వద్ద కరెంటు షాక్ తో మృతి చెందిందని ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ బొత్త రాములు అన్నారు. సుమారు లక్ష రూపాయల విలువ గల ఆవు మరణించడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు





# తెలంగాణ ఉద్యమకారుడు బండం వసంత రెడ్డిని పరామర్శించిన సునీల్ రెడ్డి

ప్రజా వాయిస్ మంథని

కొన్ని రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన మంథని నియోజకవర్గ ప్రాంతానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బండం వసంత రెడ్డిని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పెద్దపల్లి మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి పరామర్శించాడు. కరీంనగర్‌లోని అతని నివాసానికి వెళ్లిన సునీల్ రెడ్డి, వసంత రెడ్డి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నాడు. ప్రస్తుతం అందుతున్న వైద్య సహాయం, ఆరోగ్య పరిస్థితి వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పాడు. అతను త్వరగా కోలుకుని పరిపూర్ణ ఆరోగ్యంతో తిరిగిరావాలని ఆకాంక్షించాడు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# కేశవాపూర్‌లో 30 వీధి దీపాల ఏర్పాటు

**30 విధి దీపాల దాతగా ఐలాపురం కిరణ్ కుమార్ రెడ్డి**

శామీర్ పేట్ / ప్రజా వాయిస్ :లి మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేశవాపూర్ గ్రామం 10వ వార్డులో ప్రజల సౌకర్యార్థం 30 వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. 10వ వార్డు కౌన్సిలర్ మెరుపటి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టగా, ఐలాపురం కిరణ్ కుమార్ రెడ్డి దాతగా ముందుకొచ్చి 30 వీధి దీపాలను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మెరుపటి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ...... "గ్రామంలో రాత్రివేళ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వీధుల్లో మెరుగైన వెలుతురు ఉండాలనే ఉద్దేశంతో ఈ దీపాలను ఏర్పాటు చేయించామని అన్నారు. గ్రామ అభివృద్ధికి దాతగా ముందుకొచ్చి 30 వీధి దీపాలను అందించిన ఐలాపురం కిరణ్ కుమార్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తాను" అని తెలిపారు. గ్రామ అభివృద్ధికి సహకరించిన కిరణ్ కుమార్ రెడ్డి సేవలను గ్రామస్తులు అభినందిస్తూ, ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వీధి దీపాల ఏర్పాటుతో రాత్రివేళ ప్రయాణించే ప్రజలకు, మహిళలు, వృద్ధులకు మరింత భద్రత కలుగుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మేఘావత్ రెడ్యా నాయక్

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి రెడ్యా నాయక్ కృతజ్ఞతలు.**

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం:

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన మేఘావత్ రెడ్యా నాయక్, తనకు ఈ అవకాశం కల్పించినందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్యా నాయక్ మాట్లాడుతూ, తనపై పూర్తి నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అర్హులైన పేద ప్రజలకు సక్రమంగా అందేలా నిబద్ధతతో పనిచేస్తానని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు కమిటీతో పాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు శ్రేయోభిలాషులందరికీ ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



# ఘనంగా పిట్టలగూడెం జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**2008-09 బ్యాచ్ స్నేహబంధానికి వేదికగా ఆత్మీయ కలయిక**

**గురువులకు ఘన సన్మానం.. చిన్ననాటి జ్ఞాపకాలతో సందడిగా సాగిన వేడుక**

**ప్రజా వాయిస్ :** గుర్రంపోడు మండలం నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండలంలో పిట్టలగూడెం జెడ్పీహెచ్ఎస్ 2008-09 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం దర్వేశిపురంలోని ఆనందపు రామ్మూర్తి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, పాత స్నేహాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులంతా కలిసి విందు, వినోదాల్లో పాల్గొని ఆత్మీయతను పంచుకున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమ్మేళనాన్ని పాలడుగు శ్రీధర్, పగిడిమర్రి మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



# బీసీల ఐక్యతే లక్ష్యం..

**- టి.ఆర్.పి వికారాబాద్ పట్టణ అధ్యక్షుడిగా జె. సంతోష్**

**- పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడి**

**ప్రజావాయిస్/వికారాబాద్:**
తెలంగాణ రాజ్యాధికార పార్టీ వికారాబాద్ టౌన్ ప్రెసిడెంట్‌గా బీసీ సామాజిక వర్గానికి చెందిన జె. సంతోష్ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి గౌస్ పాషా సంతోష్‌ను టౌన్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ సందర్భంగా జె. సంతోష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో వికారాబాద్ టౌన్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రత్యేకంగా బీసీ సామాజిక వర్గాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారి సమస్యలు, హక్కులు, అభివృద్ధి అంశాలపై ఐక్యంగా పోరాడేందుకు కృషి చేస్తానని సంతోష్ పేర్కొన్నారు. బీసీల ఐక్యతను మరింత పటిష్టం చేసి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. వికారాబాద్ పట్టణంలోని పార్టీ కార్యకర్తలు, బీసీ సామాజిక వర్గాల నాయకులు, యువతను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివానంద్, అనిల్ కుమార్, కరీం, విశ్వనాథ్, బాలరాజ్, మహేష్, రాజు, రాము, రవి ,శేఖర్, చందు ,పాషా, శేఖర్ ,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఇల్లందు రైల్వేస్టేషన్ పునరుద్ధరణకు మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నేతలు

**ప్రజావాయిస్, ఇల్లందు(ఆగస్టు23):**
ఇల్లందులో గతంలో ప్రజలకు అందుబాటులో ఉన్న రైల్వే సేవలను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కంచర్ల శ్రీనివాస్ చేపట్టిన రిలేదీక్షకు ఇల్లందు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ..ఇల్లందు ప్రాంతానికి రైల్వేసేవలు ఎంతో కీలకమని, రైల్వేరవాణా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇల్లందు ప్రాంత అభివృద్ధి, ప్రజలరవాణా సౌకర్యం, వ్యాపార కార్యకలాపాల విస్తరణకు రైల్వేసేవల పునరుద్ధరణ అత్యవసరమని భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్ పేర్కొన్నారు.కంచర్ల శ్రీనివాస్ చేపట్టిన రిలేదీక్షకు బీఆర్ఎస్ ఇల్లందు తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని, ఇల్లందు రైల్వే పునరుద్ధరణ కోసం ప్రజలపక్షాన తమవంతు పోరాటం కొనసాగిస్తామని నాయకులు తెలిపారు.రైల్వేశాఖ, కేంద్రప్రభుత్వం స్పందించి ఇల్లందు రైల్వేసేవలను వెంటనే పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.ఇల్లందు రైల్వే పునరుద్ధరణ కోసం జరుగుతున్న ఈఉద్యమానికి ప్రజలు, ప్రజాసంఘాలు, అన్ని రాజకీయ పక్షాలు మద్దతుగా నిలవాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, మద్దతుదారులు తదితరులు పాల్గొన్నారు.

# AISF 90వ వార్షికోత్సవ ముగింపు సభలను జయప్రదం చేయండి

**ప్రభుత్వ యూనివర్సిటీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి**

**యూనివర్సిటీలలో టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి**

**రెహమాన్, AISF రాష్ట్ర యూనివర్సిటీల ఇన్‌చార్జ్**

ప్రజా వాయిస్ హన్మకొండ / కాకతీయ యూనివర్సిటీ
సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య 90వ వార్షికోత్సవ ముగింపు సభలను జయప్రదం చేయాలని **AISF** రాష్ట్ర యూనివర్సిటీల ఇన్‌చార్జ్ రెహమాన్ పిలుపునిచ్చారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో యూనివర్సిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పోరాట మార్గాన్ని ఎంచుకున్నారని తెలిపారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా సుమారు 90 వేల పాఠశాలలు మూతపడ్డాయని పేర్కొన్నారు. తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం ద్వారా విద్యను మరింత కార్పొరేటీకరణ వైపు తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. యూనివర్సిటీలలో సుమారు 70 శాతం టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసే పరిస్థితి ఏర్పడుతోందని .



పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను దూరం చేసే విధానాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

**విద్యారంగ పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి**
**AISF** హనుమకొండ జిల్లా కార్యదర్శి భాష బోయిన సంతోష్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఘాఖాఖీ 90వ వసంతాల వార్షికోత్సవ ముగింపు సభలను జయప్రదం చేయాలని విద్యార్థులు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పల్లె నుంచి పట్టణం వరకు గంజాయి వంటి మత్తు పదార్థాల విస్తరణ ఆందోళనకరంగా మారిందని. మత్తు పదార్థాల ప్రభావంతో హత్యలు, దోపిడీలు, మహిళలపై దాడులు వంటి నేరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని విద్యాసంస్థల్లో కూడా మత్తు పదార్థాల ప్రభావం విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో చోటుచేసుకున్న ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్య ఘటనను ప్రస్తావిస్తూ, ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు. భవిష్యత్తులో విద్యాసంస్థల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో శిథిలావస్థకు చేరిన సంక్షేమ హాస్టళ్ల భవనాలు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున వాటిని వెంటనే పరిశీలించి, అవసరమైన చోట పాత భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మించాలని. విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని, ఖాళీగా ఉన్న MEO, టీచర్, ఐజుూ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**భవిష్యత్ విద్యార్థి ఉద్యమాల కార్యచరణకు హనుమకొండ వేదిక**
విద్యారంగ సమస్యలు, ప్రభుత్వ యూనివర్సిటీల పరిరక్షణ, విద్యార్థుల హక్కులు, సామాజిక సమస్యలపై క్షేత్రస్థాయిలో సమగ్ర చర్చ జరిగి, భవిష్యత్ విద్యార్థి ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించేందుకు హనుమకొండ వేదిక కానుందని సంతోష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీపతి వినయ్, వేల్పుల చరణ్, కేయూ ఉపాధ్యక్షులు వంశీ, యాస్మిన్ సహాయ కార్యదర్శి అబ్బరబోయిన నాగరాజు, అనూష, జిల్లా సమితి సభ్యులు కందకట్ల అజయ్, రామ్ చరణ్ పాల్గొన్నారు.

# సేవా స్ఫూర్తికి 25 ఏళ్లు.!!

**రోటరీ క్లబ్ ఆఫ్ భద్ర సారపాక 25వ ఇన్‌స్టాలేషన్ డే వేడుకలు...**

**నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం...**

**16 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత...**

**రోటరీ సేవలను కొనియాడిన అతిథులు...**

**ప్రజా వాయిస్ బూర్గుంపాడు :**
రోటరీ క్లబ్ ఆఫ్ భద్ర సారపాక 25వ ఇన్‌స్టాలేషన్ డే వేడుకలు శనివారం సారపాక కళాభారతిలో అత్యంత ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ 25 ఏళ్ల సేవా ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు, రోట్రాక్ట్ సభ్యులు, ప్రముఖులు, గుత్తేదారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ శ్రీ రైలేంద్ర సింగ్, డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీ ఉదయ్ పిలచే హాజరయ్యారు. అలాగే పూర్వ అధ్యక్షులు ఇ.కె. రాంబాబు, జె.కె. దాస్, పూర్వ కార్యదర్శి ప్ర. చాంద్ బాషా, అసిస్టెంట్ గవర్నర్ శ్రీ కె.వి. రెడ్డి, పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ బి. శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇన్‌స్టాలేషన్ డే సందర్భంగా 2026-27 సంవత్సరానికి రోటరీ క్లబ్, రోట్రాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీ ఆర్.పి. సింగ్, కార్యదర్శిగా డేవిడ్ ఆలివర్ బాధ్యతలు స్వీకరించారు. రోట్రాక్ట్ క్లబ్ అధ్యక్షుడిగా డి. చరణ్, కార్యదర్శిగా పి. రమ్య ఎన్నికై బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు రోటరీ క్లబ్ ఆఫ్ భద్ర సారపాక గత 25 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. విద్య, వైద్యం, సామాజిక సేవ, విద్యార్థుల ప్రోత్సాహం తదితర రంగాల్లో క్లబ్ అందిస్తున్న సేవలను ప్రశంసించారు. క్లబ్‌లో గత 25 ఏళ్లుగా అధ్యక్షులు, కార్యదర్శులుగా సేవలందించిన వారిని స్మరించుకున్నారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీ ఉదయ్ పిలచే రోటరీ సంస్థ యొక్క ప్రాధాన్యతను వివరించారు. సమాజంలో అవసరమైన వారికి అండగా




నిలవడం, సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించడం రోటరీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 16 మంది మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని అతిథులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు హెచ్.ఆర్. యూనిట్ హెడ్ పి. శ్యామ్ కిరణ్, ఓ.పి. రాయ్, ఎ. సాయిరాం, వి. మురళీధర్, సూర్యప్రకాశ్, జి. శ్రీనివాస్, తిరుపతిరావు, ప్రఫుల్ల, ఎం. ఫణి, బీఎంఎస్ సభ్యులు, గుత్తేదారులు పి. దుర్గా ప్రసాద్, సత్యనారాయణ, మహేష్ రెడ్డి, బి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి పట్టుకొమ్మలు యువత

**తిమ్మాయిపల్లి అంబేద్కర్ సంఘం,ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలకు ఘన సత్కారం,**

**కీసరలో వైభవంగా 237వ వారం జ్ఞానమాల**

**ప్రజా వాయిస్, కీసర**
మారుతున్న టెక్నోలజీకి అనుగుణంగా యువతలో మార్పురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్ అభిప్రాయపడ్డారు. కీసర మండల అంబెడ్కర్ సంఘం ఆధ్వర్యంలో 237వ వారం జ్ఞానమాల కార్యక్రమంకు ముఖ్య అతిథులుగా నూతనంగా ఏర్పాటు చేసిన తిమ్మాయి పల్లి గ్రామ అంబేద్కర్ సంఘం కమిటీ అధ్యక్షులు తాళ్ళ అరవింద్ సభ్యులు, ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కానుకుంట మహేష్ లు విచ్చేసి జ్ఞానమాల సమర్పించారు.

**అభినందనలు వెల్లువ..**
తిమ్మాయి పల్లి గ్రామ యువతలో పట్టుదల ఎక్కువగా ఉంటుందని అనుకున్న లక్ష్యం కోసం ప్రయాణించే వారు ఉన్నారని అలాగే ముందుకుసాగాలని మండల అంబేద్కర్ సంఘం సూచించింది. 2022లో గ్రామాని ఐక్యం చేస్తూ భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహంను ఏర్పాటు చేయడం ఎన్నో గ్రామాలకు ఆదర్శవంతమని కొనియాడారు. మండలంలోని ప్రతి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు సమిష్టిగా కృషిచేద్దామని పేర్కొన్నారు.

**ప్రత్యేక సన్మానం...**
తిమ్మాయి పల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటైన అంబేద్కర్ కమిటీ అధ్యక్షుడు తాళ్ళ అరవింద్, ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కానుకుంట మహేష్ లను కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్ ప్రత్యేకంగా అభినందిస్తూ సన్మానించారు. భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటం అందించి ఆదర్శవంతంగా ముందుకుసాగాలని ఆకాంక్షించారు. ఈ



కార్యక్రమం లో పాల్గొన్న కీసర మండల అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు బొల్లి మహేష్, కోశాధికారి రొండ్ల మహేష్, సంయుక్త కార్యదర్శి లు తాళ్ళ కిరణ్, కుర్రి పరమేష్, సీనియర్ అంబేద్కర్ సంఘం నాయకులు శీలం మల్లేష్, కీసర బీఆర్ఎస్ అధ్యక్షులు చినింగని బాల్ రాజ్, తిమ్మాయి పల్లి అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు రాజు, కోశాధికారి కన్నేమల రాకేష్, నాయకులు కొత్తపురం కొండల్, కన్నేమల అఖిల్, మైలారం బన్నీ పలువురు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు చెక్

**30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం - వాహనం సీజ్, కేసు నమోదు**

**ప్రజా వాయిస్, ఘట్‌కేసర్:** పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వ్యక్తిపై ఘట్‌కేసర్ పోలీసులు, సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సుమారు 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు 23-08-2026న ORR ఎంట్రీ, ఘట్‌కేసర్ వద్ద వాహనం నంబర్ TS 08 UG 4980ను పోలీసులు, సివిల్ సప్లైస్ అధికారులు తనిఖీ చేశారు. వాహనంలో సుమారు 78 బస్తాల్లో 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బియ్యాన్ని తరలించేందుకు ఎలాంటి అనుమతులు, చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకపోవడంతో అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో వాహన డ్రైవర్ భూక్య సంతోష్ (26), తుర్కపల్లికు చెందిన వ్యక్తిగా గుర్తించారు. గత మూడు రోజులుగా పీడీఎస్ బియ్యం లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయించేందుకు షామీర్‌పేట్ వైపు తరలిస్తున్నట్లు అతను వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పరీక్షించగా అది పీడీఎస్ బియ్యమేనని నిర్ధారణ అయింది. దీంతో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి, రవాణా చేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేందుకు ప్రయత్నించినందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న 30 క్వింటాళ్ల బియ్యాన్ని కీసర మీూ పాయింట్‌లో భద్రపరిచినట్లు అధికారులు తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, రవాణా చేయడం లేదా బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.



# కల్లూరి రూపరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన డా.ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్

**ప్రజా వాయిస్ కొండమల్లేపల్లి మండలం ఆగస్టు 23** ఇటీవల మృతి చెందిన కొండమల్లేపల్లి నాగార్జున స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ రూప రెడ్డి కుటుంబ సభ్యులను ఈరోజు హైదరాబాద్, గుర్రంగూడ లోని నివాసాంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ హత్యకు గల కారణాలను తెలుసుకున్నారు.అనంతరం ఆర్ఎస్పి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో శాంతి భద్రతలలు ఎంత దారుణంగా దిగజారాయో అని ఇలాంటి సంఘటనను చూస్తే అర్థమవుతుంది విద్యార్థులను మంచి మార్గంలో నడిపించడానికి ప్రతి స్కూల్లో ఒక కౌన్సిలర్ నియమించాలని అదేవిధంగా తల్లిదండ్రులకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ,



విద్యార్థుల నడవడికను గమనిస్తూ ఎప్పటికప్పుడు వారి ప్రవర్తన మీద దృష్టి పెట్టాలని సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు కూడా ఇలాంటి వాటికి తావునీవకుండ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం రూపరెడ్డి చిత్రపటానికి నివాళ్లు అర్పించారు.వారి వెంట బిఆర్ఎస్ నాయకులు రామావత్ రమేష్ నాయక్, నాయిని శ్రావణ్ రెడ్డి, చనగొని శివ గౌడ్, తుర్కయంజాల్ కౌన్సిలర్ రామావత్ కళ్యాణ్ నాయక్, బండ రావిరాళ్ల సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, అనాజ్ పూర్ సర్పంచ్ ముదిగొండ మొగులయ్య, కేశవులుఅందొజు శంకరాచారి,మల్లారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ భాస్కర్,గంటేల ఆంజనేయులు,గండు నాగేంద్రబాబు,ముదిగొండ వెంకట్,అశోక్ నాయక్,శ్రీను, శివ,అడ్వకేట్ మాతంగి సురేష్, పల్లె అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తుండగా బాంబు పేలి...

### గాయపడిన వ్యవసాయ కూలీ స్వర్ణలతను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర..

### వైద్యులను ఆరోగ్య పరిస్థితిని అడిగి మెరుగైన వైద్యం అందించాలని కోరారు

ప్రజా వాయిస్ హన్మకొండ /పరకాల
భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గూడేపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గుండె స్వర్ణలత వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు బాంబు పేలుడు సంభవించడంతో తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం పరకాలలోని వినూత్న హాస్పిటల్లో చికిత్స పొందుతున్న స్వర్ణలత ని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి హాస్పిటల్కు వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా చికిత్స అందిస్తున్న వైద్యులతో మాట్లాడి స్వర్ణలత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డా. నాగరాజు ని, మేనేజ్మెంట్ తిరుపతి రెడ్డి ని కోరారు. అనంతరం స్వర్ణలత కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

# తెలంగాణలో వచ్చేది బీసీల రాజ్యమే

### జహీరాబాద్ తీన్మార్ మల్లన్న నియోజకవర్గ ఇన్చార్జ్ మేదపల్లి నర్సింహులు..

**ప్రజా వాయిస్ జహీరాబాద్:** తెలంగాణలో జరగబోయే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది బీసీల ప్రభుత్వం అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న నేతృత్వంలో బీసీలంతా ఏకం అవుతున్నారని సెప్టెంబర్ 17 నుండి మల్లన్న నిర్వహించే పాదయాత్ర తెలంగాణ చరిత్రలో సువర్ణ అక్షరాలతో రానున్నారని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మేదపల్లి నరసింహ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 10 శాతం కూడా లేని అగ్రవర్ణాల గత 79 సంవత్సరాలుగా పాలించారని 50% పైగా ఉన్న బీసీలు రాజ్యాధికారం లోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి బీసీలకు సరైన న్యాయం జరగడం లేదని సమైక్యాంధ్రలో




మోసపోయిన మాదిరిగానే తెలంగాణలో సైతం బీసీలు మరోసారి మోసానికి గురి అయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరేందుకు ఎంతోమంది ముందుకు వస్తున్నారని త్వరలో జిల్లాలో చేరికలు ఉంటాయని కూడా అన్నారు . అంతేకాకుండా బుడుగు బలహీన వర్గాలు చైతన్యం కావాల్సిన సమయం ఆసన్నం అయ్యిందని, అధికార కాంగ్రెస్ పార్టీలో రెడ్ల రాజ్యం కొనసాగుతుండగా ప్రతిపక్షం బిఆర్ఎస్ లో వెలమ రాజ్యం నడుస్తుందని, బీసీలకు అండగా నిలిచేది తీన్మార్ మల్లన్న లాంటి నాయకులేనని నర్సింహులు అన్నారు.అదేవిధంగా త్వరలో సంగారెడ్డి జిల్లాలో మల్లన్న పర్యటించటం జరుగుతుందని ఆయన తెలిపారు..



## అక్రిడిటేషన్ కార్డుల జారీ వెంటనే అమలు చేయాలి

ప్రజా వాయిస్ నాగర్కర్నూల్ ఆగస్టు 23 నాగర్ కర్నూల్ జిల్లాలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీలో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే నివారించాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. వెంకటస్వామి కోరారు.అర్హులైన ప్రతి జర్నలిస్టుకు సకాలంలో అక్రిడిటేషన్ కార్డులు అందించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ను విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్రిడిటేషన్ ప్రక్రియ పూర్తయి కార్డులు అందుతున్నా. నాగర్కర్నూల్ జిల్లాలో మాత్రం జాప్యం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలో ఇప్పటికే రెండోసారి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగినప్పటికీ కొంతమందికే కార్డులు అందాయని, ఇంకా అనేక మంది జర్నలిస్టులు ఎదురుచూస్తున్నారని తెలిపారు.నెలల తరబడి అక్రిడిటేషన్ కార్డుల కోసం ఎదురుచూడాల్సి రావడంతో జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం, ప్రజలకు జర్నలిస్టులు వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్నారని.. వారి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదన్నారు.పెండింగ్లో ఉన్న అక్రిడిటేషన్ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ను కోరారు.అక్రిడిటేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం కల్పించాలని, జర్నలిస్టుల పిల్లలకు కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కార్పొరేట్ ఆసుపత్రుల్లో జర్నలిస్టులకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని పి. వెంకటస్వామి విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టుల సమస్యలపై స్పందించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్.వెంటనే చర్యలు తీసుకోవాలని డీపీఆర్ఓను ఆదేశించారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు చేయాలి

### 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలి

### ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా, ఆగస్టు 23:/**
కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు, కర్షకులు, పథక కార్మికులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఐక్యంగా సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, ములుగు జిల్లా ఇంచార్జి నరాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. ములుగు జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జంపాల రవీందర్ అధ్యక్షతన ఏఐటీయూసీ ములుగు జిల్లా మూడవ మహాసభ జరిగింది. జెండా ఆవిష్కరణ అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నరాటి ప్రసాద్ మాట్లాడుతూ.. కార్మికులు ఎన్నో ఏళ్లపాటు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు సంకలనాలుగా కుదించడం వల్ల




కార్మికుల హక్కులకు నష్టం జరుగుతోందని అన్నారు.
కార్మికులకు హక్కులు, భద్రత కల్పించాలి
కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, కార్మిక హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మికులు తమ సమస్యలను ప్రశ్నించినప్పుడు కులం, మతం, దేవుళ్ల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు చైతన్యంతో ముందుకు సాగాలని అన్నారు.

**కొత్త కమిటీ ఏకగ్రీవ ఎన్నిక:**
ఏఐటీయూసీ ములుగు జిల్లా మూడవ మహాసభలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ముత్యాల రాజు, ప్రధాన కార్యదర్శిగా బండి నర్సయ్య ఎన్నికయ్యారు. వీరితో పాటు 15 మందితో జిల్లా మండలి కమిటీని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పోలంకొండయ్య, పోరెడ్డి ప్రమీల, గడ్డం భారతి, కుడుముల సమ్మక్క, గున్నాల రాజకుమారి, బండారి రమ, గుంజె శ్రీనివాస్, కొక్కుల రాజేందర్, యాటల పైడి, సామల దేవేందర్, నర్ర సతీష్, చాంద్ పాషా, పొన్నాల లలిత, సలువాల స్వరూప, శ్రీధర్, రాజేందర్, లావణ్య, వడి సారయ్య, వినోద్, కొత్తపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## ఆటో బంద్ను విజయవంతం చేయండి

### ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

ప్రజా వాయిస్ కగజ్ నగర్
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మండలం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 24న చేపట్టనున్న ఆటో బంద్ను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ముంజం ఆనంద్కుమార్ పిలుపునిచ్చారు. కాగజ్నగర్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్లపై పన్నులు, లైసెన్స్, ఫిట్నెస్ తదితర చార్జీల భారాన్ని తగ్గించాలని, రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిర్వహణ ఖర్చులకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు సవరించాలని, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల వేధింపులను అరికట్టాలని కోరారు. బంద్లో డ్రైవర్లు, కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వర్ధన్నపేటలో కాంగ్రెస్ నాయకుల బెదిరింపుల పర్వం

# “ఓట్ల డబ్బులు తిరిగివ్వకపోతే చంపుతాం!”

### ఎలక్షన్లలో ఒకే కుల వ్యవస్థకు చెందిన వారిని ఐదు లక్షలతో కొనుగోలు చేసినట్లు బాధితుల వెల్లడి..

### 7 వ వార్డు ఓడిపోవడంతో తిరిగి తమ డబ్బులను చెల్లించాలని ఒత్తిళ్లకు గురి చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్న ఓటర్లు..

**ప్రజా వాయిస్ వరంగల్ (వర్ధన్నపేట):**
ప్రజాస్వామ్య వ్యవస్థను పాతరేసి, అధికార మదంతో ప్రతిపక్ష ఓటర్లను, ఒకే సామాజిక వర్గానికి చెందిన ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి వర్ధన్నపేట కాంగ్రెస్ వర్గాలు. ఎన్నికల్లో ఇచ్చిన డబ్బులను తిరిగి ఇచ్చేయాలని, లేకపోతే ప్రాణాలు తీసేందుకు కూడా వెనుకాడబోమని బహిరంగంగా బెదిరింపులకు దిగుతుండటంతో వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 12వ వార్డుల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రూ. 5 లక్షల ఆఫర్... ఏకపక్షంగా ఓట్ల కొనుగోలు!**
బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల వేళ 7, 8, 12వ వార్డుల్లో అత్యధిక సంఖ్యలో ఉన్న ఒకే కుల వ్యవస్థకు చెందిన ఓటర్లను లొంగదీసుకునేందుకు స్థానిక కాంగ్రెస్ నాయకత్వం కుట్ర పన్నింది. వార్డు ప్రజలకు ‘కమిటీ హాల్’ నిర్మించి ఇస్తామని, అందుకు రూ. 5 లక్షలు ఇస్తామని ఆశచూపి పది లక్షల రూపాయలను అప్పచెప్పారు. ఏకపక్షంగా తమ పార్టీకే ఓట్లు వేయాలని స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, ఆయన అనుచరులు తీవ్ర ఒత్తిడి తెచ్చారనీ ఆ వేదన వ్యక్తం చేస్తున్నారు.ఎన్నికల సమయంలో సామ,దాన,భేద దండోపాయాలు ఉపయోగించిన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు




ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రత్యక్ష బెదిరింపులకు దిగుతున్నారనీ. స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సైతం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ, “మీ వార్డులను ఎవరు అభివృద్ధి చేస్తారో చూస్తా!” అంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడటంతో వారికి ఏం చేయాలో అర్థంకావడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల ఆవేదన - పోలీసు యంత్రాంగం ఏం చేస్తోంది?**
ఎలక్షన్లలో 7 వ వార్డు కౌన్సిలర్ గా కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వకపోతే ప్రాణాలు తీస్తామని కాంగ్రెస్ గుండాలు హెచ్చరిస్తున్నారనీ స్థానిక 7, 8, 12 వార్డుల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ ఒక సామాజిక వర్గాన్ని, వార్డు ప్రజలను లక్ష్యంగా చేసుకుని అభివృద్ధిని ఆపుతామని బెదిరించడం ఎంతవరకు సమంజసం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాన్నకి తోడుగా పోలీస్ స్టేషన్లలో కూడా వారిని పిలిపించి సిఐ సమక్షంలో కూడా చర్చలు జరిపినట్లుగా వారు వెల్లడించారు. ఏది ఏమైనా బెదిరింపులకు దిగుతున్న ఎమ్మెల్యే అనుచరులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అధికారం చేతిలో ఉందని చట్టాన్ని, ప్రజలను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకుల అక్రమాలకు చట్టం ముందైనా, ప్రజల తీర్పు ముందైనా మూల్యం చెల్లించుకోక తప్పదని స్థానికులు హెచ్చరిస్తున్నారు...

**సీఐ వివరణ::**
వర్ధన్నపేట ఫిరంగి గడ్డ ఏడవ ఎనిమిదవ 12 వ వార్డులలో ఒకే కుల వ్యవస్థకు చెందిన వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్టుగా మా దగ్గరికి ఇంతవరకు సమాచారం రాలేదు అలాగే మా దగ్గరికి కూడా ఎవరిని తీసుకురాలేదని తెలిపారు.. ఒకవేళ అలాంటి సంఘటన జరిగిన ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే వారిని ఎవరిని కూడా ఉపేక్షించేది లేదు అని తెలిపారు.. దీనిపై మేము కూడా సమగ్ర విచారణ జరిపి సంఘటన గల కారణాలు ఏంటో తెలుసుకుంటామని తెలిపారు





## కొమరం భీమ్ కాలనీకి నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

**జూగా స్కీమ్ ద్వారా విద్యుత్ స్తంభాలు మంజూరు**

**ఎమ్మెల్యే కోరం కనకయ్య , సర్పంచ్ కు కృతజ్ఞతలు**

**ప్రజా వాయిస్, బయ్యారం..**
బయ్యారం మండలంలోని కొమరం భీమ్ కాలనీ ప్రజల విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. ఇల్లందు హైవే రోడ్డు నుంచి ఎట్టి కోటయ్య ఇంటి వరకు జూగా స్కీమ్ ద్వారా నూతన విద్యుత్ స్తంభాలు ఇల్లందు శాసనసభ్యులు కొరం కనకయ్య సహకారంతో మంజూరయ్యాయి. అందులో భాగమే ఈరోజు మంజూరైన విద్యుత్ స్తంభాలను సంబంధిత అధికారులు సిబ్బంది కొమరం భీమ్ కాలనీలో నిర్మించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ,కాలనీ ప్రజలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు, విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని, ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాలు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను, ఎన్నికల హామీలను అమలు చేస్తున్న సర్పంచ్ ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం" అని కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి రావి వీరభద్ర రావు , దానసరి వీరభద్రం చల్లా సురేష్ , రాము , ఇస్మాయిల్ , ఎట్టి కోటయ్య , పెనుగొండ నరేష్, తదితరులు పాల్గొన్నారు..





## అయ్యప్ప సేవా సమాజం రాష్ట్ర కార్యదర్శిగా సుధాకర్ గౌడ్..

- జిల్లా కార్యవర్గ సభ్యుడిగా గొల్ల ప్రశాంత్..
- సదాశివపేట గురుస్వామికి దక్కిన గౌరవం..
- ఏళ్లుగా అయ్యప్పకు అంకితమైన సుధాకర్ గురుస్వామి...

**ప్రజా వాయిస్,సదాశివపేట:**-శబరిమల అయ్యప్ప సేవా సమాజం రాష్ట్ర కార్యదర్శిగా సదాశివపేట పట్టణానికి చెందిన సుధాకర్ గౌడ్ గురు స్వామి నియామకమయ్యారు, ఈ మేరకు జాతీయ ప్రధాన కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని ఆదివారం అందుకున్నారు. దీంతోపాటు సదాశివపేటలో తన డప్పు కల తో కళాకారుడిగా అయ్యప్ప సేవలో ఉంటున్న గొల్ల ప్రశాంత్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమించబడ్డారు ఎప్పుడు అయ్యప్ప సేవలు ఉండే మాకు ఇంతటి అరుదైన గౌరవం దక్కిందని మాట్లాడారు దీంతోపాటు సుధాకర్ గురుస్వామి మాట్లాడుతూ తనకు రాష్ట్ర కార్యవర్గంలో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ తత్వమసి అయ్యప్ప స్వామి అనుగ్రహంతో అయ్యప్ప స్వామి గానామృతంతో ఎందరో స్వాములకు మాలలు వేసిన నేను ఇంకా అయ్యప్ప తత్వాన్ని తెలియజేస్తానని మాట్లాడారు ఈ కార్యక్రమంలో ప్రముఖులు, పెద్దలు పాల్గొన్నారు

## చెరువులో నీళ్లను ఎల్లగొట్టినా పట్టించుకోని అధికారులు

**ప్రజల ఆగ్రహం - చర్యలు తీసుకోవాలని డిమాండ్**


**ప్రజా వాయిస్ హన్మకొండ /ఆత్మకూర్**
హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం నీరుకుళ్ల గ్రామంలోని చెరువులో నీటిని అక్రమంగా ఎల్లగొట్టినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. చెరువులో ఉన్న నీటిని అనుమతి లేకుండా బయటకు తరలించడంతో నీటి వనరులకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చెరువు నీటిపై ఆధారపడే రైతులు ఈ పరిణామంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.చెరువులో నీటిని ఎల్లగొట్టేందుకు ఎవరు అనుమతి ఇచ్చారు? నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయా? అనే విషయాలపై అధికారులు విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. చెరువు నీటి వినియోగం, నీటి విడుదలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువును పరిశీలించి, నీటిని ఎల్లగొట్టిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ గొల్ల రమేష్‌కు ఘన నివాళి

**గుండెపోటుతో గొల్ల రమేష్ అకాల మరణం**

**జర్నలిస్టు వర్గాల్లో విషాదం**

**మనోహరాబాద్, ప్రజా వాయిస్**
మెదక్ జిల్లా మనోహరాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ గొల్ల రమేష్ రాత్రి గుండెపోటుతో అకాల మరణం చెందడంతో జర్నలిస్టు వర్గాల్లో విషాదం నెలకొంది. రమేష్ మరణ వార్త తెలుసుకున్న ఉమ్మడి తూప్రాన్-మనోహరాబాద్ ప్రాంతానికి చెందిన సీనియర్ పాత్రికేయులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ పాత్రికేయులు, మన కర్తవ్యం ఎడిటర్ లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్ ఆధ్వర్యంలో రమేష్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, తీవ్ర సానుభూతిని తెలియజేశారు.మృతుని కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఉమ్మడి తూప్రాన్ – మనోహరాబాద్ ప్రెస్ క్లబ్ తరఫున గొల్ల రమేష్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, జర్నలిజం రంగానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్య క్రమంలో సీనియర్ పాత్రికేయులు ఆర్. శివశంకర్ గౌడ్, నమస్తే తెలంగాణ తూప్రాన్ డివిజన్ రిపోర్టర్ తీగుళ్ల నాగరాజు, టీవీ5 తూప్రాన్ డివిజన్ రిపోర్టర్ గైనిబైటి భాస్కర్ గౌడ్, సూర్య రిపోర్టర్ రామస్వామి, మచ్చ యాదగిరి, శివ కృష్ణ గౌడ్, పెద్దిగారి నగేష్, నవీన్, చందు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు




# ఖబర్దార్ మధుకర్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోని మాట్లాడు

**దళిత మహిళా అధికారిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు.**

**జిల్లా అధికారిని అవమానించేలా మాట్లాడటం సిగ్గుచేటు**

**డీ సీ ఓ కి మధుకర్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి**

**నిజాయితీగా విధులు నిర్వహిస్తే రాజకీయ బంధాలా?**

**మీ రెడ్డి సామాజిక మహిళ అధికారులంతా ఫెవికాల్ బంధాలు పెట్టుకొనే విధులు నిర్వహిస్తున్నారా..?**

**రౌడీ షీటర్ మధుకర్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం**

**MRPS, మాలమహానాడు,దళిత సంఘాలు**

**ప్రజా వాయిస్, బయ్యారం..**
జిల్లా సహకార సంఘంలో నీతి నిజాయితీగా విధులు నిర్వర్తిస్తున్న దళిత మహిళా అధికారిపై రాజకీయపరమైన ఆరోపణలు చేయడం, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కొతపేట-గంధపల్లి గ్రామంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ తన విధులను బాధ్యతగా నిర్వహిస్తున్న అధికారిపై వ్యక్తిగత, రాజకీయ కక్షతో ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అధికారి తన విధులను నిబంధనల ప్రకారం నిర్వహిస్తే, అందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించుకోవాలని, దళిత మహిళా అధికారిని పట్టుకుని ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని, ఒక అధికారి తన విధులను నిబంధనల ప్రకారం నిర్వర్తిస్తుంటే, ఆమెను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని రాజకీయ బంధాలుగా చిత్రీకరించడం ఎంతవరకు సమంజసమని.? అంతేకాదు రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా మీ రెడ్డి సామాజిక మహిళ అధికారులంతా పలు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు వారు కూడా రాజకీయ నాయకులతో ఫెవికాల్ బంధాలు పెట్టుకొనే విధులు నిర్వహిస్తున్నారా..? అని ప్రశ్నించారు. ఆరోపణలు ఉంటే ఆధారాలతో మాట్లాడాలి కానీ వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం, అధికారుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. రాజకీయాలు శాశ్వతం కాదని, ప్రజలకు నిజాయితీగా సేవలందించే అధికారులు మాత్రం వ్యవస్థకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఒక మహిళా అధికారిని, అందులోనూ దళిత అధికారిని అవమానించేలా, దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. నిజాయితీగా విధులు నిర్వర్తించే అధికారులకు తమ పూర్తి మద్దతు



ఉంటుందని దళిత సంఘాల నాయకులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో దళిత అధికారులు, మహిళా అధికారులపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు లేదా రాజకీయ వేధింపులు పునరావృతం కాకుండా జిల్లా పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మధుకర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, ణజూకి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు సంగేపొంగు శ్రీను, బైగాళ్ల వీరబాబు, కాస్తల నవీన్, పుల్లూరి సుధాకర్, చెరుకుపల్లి గోపి, పందుల తేజ, మంచాల నాగరాజు, అంచపల్లి రవి, బొడ్డు నర్సయ్య,ఇనుపనూరి రాములు, ఇర్రి ప్రేమ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు...

# ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి

**టీజేపీసీ నాయకులు కోల విజయ్ కుమార్**

**ప్రజా వాయిస్ మిరుదొడ్డి**
తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమాల్లో లాఠీ దెబ్బలు తిని, అనేక కేసులు ఎదుర్కొని ప్రాణాలను సైతం పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించుకున్న తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోల విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో నిర్వహించిన ఉద్యమకారుల సభ్యత్వ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఉద్యమకారుల



సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇంటి స్థలం, పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి, దాన్ని అమలు చేయడానికి కేకే కమిటీని వేసి కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. హామీల అమలును వాయిదాల మీద వాయిదాలు వేస్తూ, తెలంగాణ ఉద్యమ లక్ష్యాలను మరియు ఉద్యమకారులను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో టీజేఏసీ రాష్ట్ర కార్యదర్శి నందిని మాస్టర్, నాయకులు గాజుల రమేష్, భూమరాజయ్య, కొమురయ్య, సిద్ది రమేష్ గౌడ్, మల్లేశం, రాందేవ్, జ్ఞానేశ్వర్ తో పాటు పలువురు ఉద్యమకారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి

# సమయం ఉంటుంది....

**- ప్రభుత్వ ఆసుపత్రి భవన ప్రారంభోత్సవానికి టైం మాత్రం లేదు...ఇది మంత్రి దామోదర్ పనితీరు**

**ప్రజా వాయిస్ సంగారెడ్డి :**
రాష్ట్ర ప్రభుత్వం వైద్యం, విద్య శాఖకు ప్రాధాన్యత ఇస్తుందని గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా మంత్రి పనితీరు ఉంది. దీనికి నిదర్శనమే మండల కేంద్రమైన పుల్కాల్ లో రెండు కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం పూర్తయి మూడు సంవత్సరాలు గడుస్తున్నా మంత్రి సమయం ఇవ్వకపోవడంతో ప్రారంభ స్వామికి నోచుకోవడం లేదు. కానీ ఇదే సమయంలో జిల్లాలోని మార్మూల ప్రాంతమైన నారాయణఖేడ్ కు చెందిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి కుటుంబం సంబంధించిన అనురాగ్ ఆసుపత్రి నూతన భాను ప్రారంభోత్సవానికి మాత్రం మంత్రి వెళ్లారు. అంటే దాదాపుగా సంగారెడ్డికి 60 కిలోమీటర్లు... అంత దూరం వెళ్లి ప్రైవేట్ ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న పుల్కల్లో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న భవనాన్ని మాత్రం ప్రారంభించేందుకు మంత్రికి సమయం దొరకడం లేదు. ఫలితంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు సౌకర్యాలు అందుబాటులో లేక ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. కోట్లు వేచించి నిర్మించిన భవనం మంత్రి సమయం ఇవ్వకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది.



# రోస్టర్ విధానం రద్దుకు జాతీయ మాల మహానాడు డిమాండ్

## ఆగస్టు 31న సెక్రటేరియట్ ముట్టడికి పిలుపు

ప్రజా వాయిస్ దుబ్బాక
రోస్టర్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, సామాజిక న్యాయం జరిగేలా రిజర్వేషన్లను పునఃసవరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ మాల మహానాడు దుబ్బాక నియోజకవర్గం ఆధ్వర్యంలో 'హలో మాల.. చలో దుబ్బాక' కార్యక్రమాన్ని నిర్వహించారు. దుబ్బాక పట్టణంలోని పోచమ్మ ఆలయ ఆవరణలో ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి సుద్దాల దేవయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రస్తుతం అమలులో ఉన్న రోస్టర్ విధానం వల్ల మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం



జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలని, రిజర్వేషన్ల వ్యవస్థను పునఃసవరించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో భాగముగానే ఈ నెల 31న నిర్వహించనున్న రాష్ట్ర సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి మాలలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ కాల్వ నరేష్, రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు ర్యాకం శ్రీరాములు, సీనియర్ జర్నలిస్ట్ అస శ్రీరాములు, పట్టణ అధ్యక్షుడు కాల్వ లింగం, అస రాజశేఖర్, దుబ్బాక మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ అస సులోచన స్వామి, 14వ వార్డు కౌన్సిలర్ తునికి సురేష్, ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు, పెద్ద చీకోడ్ మాజీ సర్పంచ్ తౌడా శ్రీనివాస్, బిట్ల ఎల్లం కళాకారుల బృందంతో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# అంతరిక్ష సాంకేతికతపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించాలి

నర్సాపూర్, ప్రజా వాయిస్
జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సాపూర్‌లోని బి.వి. రాజు సాంకేతిక విద్యా సంస్థలో 'చంద్రప్రస్థాన్-2026' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనలు, గ్రహాల అన్వేషణ, ఆధునిక సాంకేతికతపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా పలు విజ్ఞాన, సాంకేతిక కార్యక్రమాలు చేపట్టారు. సాంకేతిక క్విజ్‌లు, గ్రహ ల్యాండర్ నమూనా తయారీ పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ వెంకట్ శేషు రెడ్డెం సముద్రాలు, వాతావరణం, జీవం మధ్య సంబంధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ బి.ఆర్. సంజీవ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల పరిపాలనా నిర్వాహకులు బి. బాపి రాజు, అధికారి టి.ఎల్.ఎన్. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# లోక కల్యాణార్థం రామకోటి లిఖిత మహాయజ్ఞం

### - రాంసాగర్‌లో భద్రాచల రామకోటి పుస్తకాల పంపిణీ



ప్రచారం వాయిస్
దౌల్తాబాద్, ఆగస్టు 23:
లోకకల్యాణమే లక్ష్యంగా, శ్రీరామ నామమే శక్తిగా శ్రావణమాసంలో 10 కోట్ల శ్రీరామ నామ లిఖిత మహాయజ్ఞానికి శ్రీరామకోటి భక్త సమాజం శ్రీకారం చుట్టిందని సంస్థ వ్యవస్థాపకులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు తెలిపారు. ఆదివారం రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలోని రామాలయంలో భద్రాచలం నుంచి తీసుకువచ్చిన నూతన రామకోటి పుస్తకాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ నామాన్ని పలికే, లిఖించే ప్రతి హృదయం పవిత్రమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ శ్రీరామ నామాన్ని స్మరిస్తూ, లిఖిస్తూ మహా సంకల్పంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 10 కోట్ల లిఖిత శ్రీరామ నామాలను పూర్తి చేసి భద్రాచలానికి సమర్పించడమే ఈ మహా సంకల్పం లక్ష్యమన్నారు. ఇది కేవలం లిఖిత యజ్ఞం మాత్రమే కాకుండా భక్తి, ధర్మం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందించే మహోద్యమమని పేర్కొన్నారు. గత మూడు దశాబ్దాలుగా భక్తులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తున్నామని తెలిపారు. రామాలయ అధ్యక్షులు ఎనిశెట్టి వెంకటేశం మాట్లాడుతూ గ్రామ భక్తులకు ఇంతటి మహాభాగ్యాన్ని కల్పించిన రామకోటి రామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయిని ఆదిరెడ్డి, బిక్కుమల్ల నాగేష్, శ్రావణ్, బిక్షపతి, మెట్టయ్య, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# నార్నూర్ రోడ్డు సమస్య పరిష్కారానికి అజ్మీర శ్యాంనాయక్ చొరవ



ప్రజా వాయిస్ ఆసిఫాబాద్
నార్నూర్ మండలంలో రహదారి గుంతలమయంగా మారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ దృష్టికి మండలవాసులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన శ్యాంనాయక్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన శ్యాంనాయక్‌కు, సానుకూలంగా స్పందించిన కలెక్టర్‌కు మండలవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



# పాపన్నపేటలో మాటిమాటికి విద్యుత్ కోత....


### అధికారులపై మండిపడుతున్న రైతన్నలు....

ప్రజా వాయిస్, పాపన్నపేట
పాపన్నపేట మండల పరిధిలోని పలు గ్రామాలలో మాటిమాటికి విద్యుత్ లో అంతరాయం ఏర్పడడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని పలు గ్రామాల రైతులు, మరియు పలు ప్రజా సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుకు కనీసం 6:00గంటలు కూడా కూడా సరిగ్గా ఉండడం లేదని, గ్రామస్తులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇప్పటికైనా విద్య శాఖ అధికారులు సకాలంలో విద్యుత్ లో అంతరాయం ఏర్పడకుండా నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేవిధంగా చూడాలని గ్రామ ప్రజలు మరియు మండల ప్రజలు కోరుతున్నారు.

# సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా నక్క సుధాకర్



ప్రజా వాయిస్.. వనపర్తి
చిన్నంబావి సమాచార హక్కు చట్టం సాధన కమిటీ-వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా నక్క సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు చిన్నంబావి మండల అధ్యక్షుడిగా పనిచేసిన ఆయనను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇటీవల కాలంలో వనపర్తి జిల్లాలో కమిటీలు ఏర్పాటు చేస్తూ, సమాచార హక్కు చట్టం సాధన కమిటీని బలోపేతం చేయడంలో నక్క సుధాకర్ చేసిన కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. సుధాకర్ గత కొంతకాలంగా కమిటీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో కమిటీ బలోపేతానికి కీలకంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించి జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు నక్క సుధాకర్‌కు కమిటీ సభ్యులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వనపర్తి జిల్లాలో మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. జిల్లా అధ్యక్షుడు ఎన్నికైన నక్క సుధాకర్ కు సాధన కమిటీ శుభాకాంక్షలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.




# దళిత సమాజానికి అండగా భారతీయ జనతా పార్టీ

### సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

ప్రజా వాయిస్ కాగజ్ నగర్
హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సంత్ శిరోమణి గురు రవిదాస్ 650వ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో కలశ వందన అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. దళిత సమాజానికి భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు పేర్కొన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ జీవితానికి సంబంధించిన ఐదు క్షేత్రాలను తీర్థ క్షేత్రాలుగా తీర్చిదిద్దిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీది అని తెలిపారు. "జై భీమ్ జై మీమ్" నినాదాలతో దళిత సమాజాన్ని హిందూ సమాజం నుంచి విడగొట్టే ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అంటరానితనం కనుమరుగవుతున్న పరిస్థితి వచ్చిందని, దళితుల అభ్యున్నతికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పాల్గొన్నారు



# ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠ

### అక్టోబర్ 22న జయంతి రాష్ట్ర అధికారిక కార్యక్రమంగా నిర్వహణ

ప్రజా వాయిస్ రాజేంద్రనగర్:
పాలమూరు ప్రజావీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ విగ్రహాన్ని అక్టోబర్ 22న ఆయన జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జయంతి,వర్ధంతులను రాష్ట్ర అధికారిక కార్యక్రమాలుగా నిర్వహించేందుకు ప్రభుత్వం జీ.ఓ. ఆర్టీ.నంబర్.1217 ద్వారా గుర్తింపు ఇవ్వడంపై ముదిరాజ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నివాసంలో,మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. విగ్రహ ప్రతిష్ఠ,జయంతి వేడుకల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు,సంఘాల ప్రతినిధులు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. పండుగ సాయన్న చరిత్ర,ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాన్ని భవిష్యత్ తరాలకు పరిచయం చేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వివిధ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పలువురు ముదిరాజ్ నాయకులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# 2వ పీఆర్‌సీ వెంటనే ప్రకటించి అమలు చేయాలి

### టీజీఈజేఏసీ డిమాండ్

ప్రజా వాయిస్ కగజ్ నగర్
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో తెలంగాణ గెజిటెడ్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లా కలెక్టరేట్ల ముందు నిర్వహించే ధర్నా సన్నాహక సమావేశం జరిగింది. 2వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, 6 డీఏలు విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని టీజీఈజేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లుల బకాయిలు చెల్లించాలని, వర్క్ అడ్జస్ట్‌మెంట్ జీవో 25ను రద్దు చేయాలని, పర్యవేక్షణ అధికారుల నియామకానికి సర్వీస్ రూల్స్ రూపొందించాలని, హెల్త్ కార్డులు సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఈ నెల 27న జిల్లా కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడి చరణ్‌దాస్, ఏటుకూరి శ్రీనివాసరావు, వైద్య శాంతికుమారి, జయదేవ్ అబ్రహం, శివప్రసాద్, ప్రభాకర్, డి. ఇస్తారి, జే. కేశవ్, ప్రకాశ్, దేవాజీ, బిక్షపతి, మహిపాల్, మహేష్, రాజ కమలాకర్‌రెడ్డి, ఆరిఫ్ అహ్మద్, అన్వర్ అహ్మద్. పాల్గొన్నారు